ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 28 సంచిక : 2 అక్టోబర్ 2022

## ఈ సంచికలో. . . .

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 2


శ్రీమద్భగవద్గీత ........................................................ 29

అక్షరమణమాల ........................................................ 31

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



సూర్యుడికి ప్రకాశం ఎంత సహజమో, చంద్రుడికి చల్లదనం ఎంత సహజమో, అగ్నికి వేడి ఎంత సహజమో, అలాగే మన హృదయంలో ఉన్న సద్వస్తువుకి ఆనందం, శాంతి ఉండటం అంతే సహజం.

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 32

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు|| 150/-

విడి ప్రతి : రు|| 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప||గో|| జిల్లా, ఆం||ప్ర||

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 12 మార్చి 1989, వేంపాడు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

నాకు మనసులో కుదురు లేదు అని చెప్తారు. దీనికి కారణం ఏమిటంటే, ఈ జన్మలో కాని, పూర్వ జన్మలో కాని, మనం అందరం చేసినటువంటి పొరపాటు ఒక్కటే. దేవుడు ఏ పని అయితే చేయవద్దు అని మన తోటి చెప్పాడో ఆ పని చేస్తున్నాము. ఇందులో మరీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఏ పని చేయవద్దు అని చెప్పాడో ఆ పని మీదకే మన మనస్సు వెళుతుంది. నేను చెప్పే ప్రతీ విషయం కూడా తాత్కాలికంగా మీకు నచ్చకపోయినా ఇంటికి వెళ్లి మీరు ప్రశాంతంగా ఆలోచించుకోండి. ఎందుచేత అంటే ఇప్పుడు ఇక్కడ మీకు చిరాకుగా ఉంది అనుకోండి, నా మాటలు మీ బుర్రకి ఎక్కవు. మనకి ఎప్పుడైనా చిరాకు వచ్చినా, కోపం వచ్చినా ఆ కోపం రాక ముందు ఉన్న తెలివి, ఆ చిరాకు రాక ముందు ఉన్న తెలివి ఆ గంటలో ఎక్కడికో పోతుంది. అంతా చల్లబడ్డాక మళ్ళీ మన బుర్రలోకి వస్తూ ఉంటుంది. ఈ గంట, రెండు గంటలు మటుకు ఎక్కడికో పారిపోతూ ఉంటుంది. దేవుడు ఏ పని అయితే మనలని చేయవద్దు అన్నాడో ఆ పని చేస్తున్నాము. ఆ పని మీదకే మన మనస్సు వెళ్లిపోతూ ఉంటుంది. ఏ పని అయితే చేయమని చెప్పాడో, ఆ పని మనం చెయ్యము. మేము ఉపన్యాసాలు చెబుతున్నాము. జ్ఞాని ఉపన్యాసాలు చెప్పడు. ఉపదేశం చెప్తాడు. భగవంతుడు ఏ పని అయితే నిషేధించాడో, ఏ పని అయితే చేయవద్దు అన్నాడో, ఆ పనే మనం చేస్తూ ఉంటాము. అందువలన అశాంతి వస్తుంది, దుఃఖం వస్తుంది.

ఇక్కడ కూర్చున్న మనం అందరము కూడా కోపం రాకూడదు, చిరాకు రాకూడదు, ద్వేషం రాకూడదు అని అనుకుంటాము. కాని అందరికి అవే వస్తున్నాయి. శ్రీరాముడికి కోపం వచ్చేది కాదట, ఆయన తెచ్చుకునే వాడట, మనకి ఆయనకి తేడా అదే. ఏ యుద్ధం చేసేటప్పుడో కోపం అవసరం అనుకోండి. ఆ కోపాన్ని తెచ్చుకునేవాడట. తెచ్చుకుంటేనే అది వచ్చేదట. మనకి తెచ్చుకోవక్కర్లేదు వద్దు బాబోయ్ అంటే వచ్చేస్తుంది. అంటే కోపం స్వాధీనంలో మనం ఉన్నాము, రాముడి స్వాధీనంలో కోపం ఉంది. అందుచేత ఆయన రమ్మంటే వచ్చింది. మనం రమ్మని పిలవక్కరలేదు బలవంతంగా వచ్చి మీద పడుతుంది. రామాయణంలో ఒక చోట రాముడికి కోపం తెచ్చుకోలేదు కోపం వచ్చింది అని ఉంది. మనలాగా ఆయనకి ఒకసారి వచ్చేసింది అని వ్రాసాడు. ఎప్పుడు వచ్చింది అంటే రావణాసురుడు తోటి రామచంద్రమూర్తి వారు యుద్ధం చేస్తుంటే, ఆయన కింద నుంచుని యుద్ధం చేస్తున్నాడు, రావణాసురుడు

రథం మీద నిలబడి యుద్ధం చేస్తున్నాడు. స్వామీ మీరు కింద నిలబడి యుద్ధం చేయడం మంచిది కాదు నా భుజాల మీద కూర్చొని మీరు యుద్ధం చెయ్యండి అని, ఆంజనేయస్వామి వారు రామచంద్రమూర్తిని ఆయన భుజాల మీద కూర్చోబెట్టుకుని యుద్ధం చేస్తున్నాడు. అంటే రథం మీద కూర్చొని రావణాసురుడు యుద్ధం చేస్తున్నాడు. ఆంజనేయస్వామి వారు ఆయన భుజం మీద కూర్చోబెట్టారు రాముడిని, అప్పుడు యుద్ధం చేస్తున్నాడు. రావణాసురుడు వేసే బాణం ఒక పక్క వస్తుంటే ఇంకో పక్కకి రామచంద్రమూర్తిని తప్పించేవాడట ఆంజనేయస్వామి. ఎందుచేత అంటే ఈయన భుజాల మీద ఉన్నాడు కాబట్టి, అందుచేత రావణాసురుడు ఏమి చేసేవాడు అంటే రాముడి మీదకి గురి పెట్టడం మానేసి, మోసేవాడి మీద, ఈ ఆంజనేయస్వామి మీదకి బాణాలు గురి పెట్టి కొడుతుంటే, ఎర్రగా అయిపోయి శరీరం అంతా రక్తం కారుతుంటే, అప్పుడు కోపం తెచ్చుకోలేదట, వచ్చింది, ఎవరికి? రామచంద్రమూర్తికి. ఇక్కడ ఒక్క చోటే వాల్మీకి రాముడికి కోపం వచ్చింది అని చెప్పాడు. అంతకుముందు తెచ్చుకునేవాడు అని చెప్పాడు కానీ ఇక్కడ వచ్చింది అని చెప్పాడు. అంటే ఆయన స్వవిషయంలో ఆయనకు కోపం వచ్చేది కాదు. తెచ్చుకునేవాడు. కాని తన భక్తుడి విషయానికి వచ్చేటప్పటికి ఆయనకు కోపం వచ్చేసింది.

నా యందు ఈశ్వరుడికి ప్రేమ లేదు అని ఎవరు అనుకోవద్దు. మన అందరి పట్ల ఆయనకు ప్రేమ ఉంది, ఆప్యాయత ఉంది. అందరిని ప్రేమిస్తున్నాడు. ప్రేమ లేదని మనం అనుకుంటాం. మతం ఎందుకంటే మనసుని బాగుచేయటానికి మతం. మీరు మతాన్ని కాదు మార్చుకోవాల్సింది. మారు మనసు పొందని మనసుని మార్చుకోవాలి. మనస్సును పవిత్రం చేసుకుంటే, మనసుని మార్చుకుంటే మీకు తప్పనిసరిగా మోక్షం వస్తుంది. యేసుక్రీస్తు తనని ప్రేమించే వాళ్లని ప్రేమించాడు. అలాగే మనల్ని ప్రేమించే వాళ్లని మనం ప్రేమిస్తాం. ఇంతవరకు యేసు క్రీస్తు, మనం సమానమే. కాని యేసుక్రీస్తు తనని శిలువ వేసిన వాళ్లని కూడా ప్రేమించాడు. మనల్ని ఎవరు శిలువ వేయక్కరలేదు చిన్న మాట అంటే వేడెక్కిపోతాము. మీరు నేర్చుకుంటే అటువంటి ప్రేమని నేర్చుకోండి అంతే కాని మతం కాదు మీకు కావలసింది, అందుకు చెబుతున్నాను. అలాగే రామచంద్రమూర్తికి ఎన్నో కళ్యాణ గుణాలు ఉన్నాయి. ఎన్నో గొప్ప గుణాలు ఉన్నాయి. ఆదర్శ గుణాలు ఉన్నాయి. అవి నేర్చుకోండి. గౌతమబుద్ధుడి విషయం తీసుకోండి, తన భార్యని విడిచిపెట్టేశాడు. తన బిడ్డని విడిచిపెట్టేశాడు. అంటే భార్య మీద ఇష్టం లేదా? బిడ్డ మీద ఇష్టం లేదా? సమాజాన్ని అంతా ప్రేమిస్తున్న బుద్ధుడు ఆయన భార్యని ప్రేమించడా? తన భార్యని ప్రేమిస్తాడు. అయితే ఎందుకు విడిచిపెట్టాడు అంటే సమాజాన్ని అంతా ప్రేమించడం కోసం, ఆ ప్రేమకి భార్య

మీద ఉన్న మమకారం అడ్డురాకుండా ఉండడం కోసం భార్యని విడిచిపెట్టాడు కాని భార్య మీద ద్వేషం కాదు, కక్ష కాదు.

ఇప్పుడు మనకి complaint ఏమిటంటే, మాకు అశాంతి వస్తోంది, మా మనసు కుదురుగా ఉండటం లేదు, మా మనసు చిరాకుగా ఉంటోంది అంటారు. ఈ జన్మలో కాని, పూర్వజన్మలో కాని, మనం ఏ పని అయితే చేయకూడదో ఆ పని చేశాం. అది అశాంతి రూపంలో మనకి వస్తోంది. మనం భగవంతుడు చేయమని చెప్పిన పనులు కనుక చేస్తూఉంటే, దానివల్ల మనకి శాంతి వస్తుంది, ఆరోగ్యం వస్తుంది, మోక్షం వస్తుంది. భగవంతుడు ఏ పని చేయమన్నాడో ఆ పని చేయండి. ఆయన వద్దు అని చెప్పిన పని మానేయండి. కానీ మనం భగవంతుడు వద్దు అని చెప్పిన పని చేస్తాము, అశాంతి వచ్చింది అని బాధ పడతాము. ఆయన చెయ్యమని చెప్పిన పని మనం చేస్తే మనకి సుఖం వస్తుంది. ఆయన వద్దు అని చెప్పిన పని మనం మానేస్తే దుఃఖం రాదు. అందుచేత మానవుడికి వచ్చే అశాంతి, మానసిక సంబంధమైనది. మేము చెప్పటం తేలిక. మీరు వినటం తేలిక. చదవటం తేలిక. అంతకంటే కొంచెం కష్టం బోధించటం. అంతకంటే కష్టం ఆచరించటం. ఆచరించటం కష్టం కాబట్టి దానికి దూరంగా ఉంటున్నాము.

ఎవరైనా చనిపోతే ఎంతో ఆశ్చర్యంగా ఆ పోయారా అంటాం, ఏవండి ఎప్పుడు పోయారు? ఎలా పోయారు? అని ఆశ్చర్యంగా అంటాం. కాని ఒక్క మాట మటుకు మీరు అందరూ గుర్తు పెట్టుకోండి. తల్లి కడుపులోనుండి మన శరీరం ఎప్పుడు పుట్టిందో ఆ రోజునే చావు కూడా పుట్టింది. మనం పుట్టినప్పుడే మన కూడా చావు కూడా పుట్టింది. అయితే పుట్టుకకి, చావుకి కొంత గ్యాప్ ఉంటుంది. చావు ఎప్పుడో వస్తుంది అనుకోకండి అది పుట్టే ఉంది. మనం నిద్ర పోతుంటే అదీ నిద్రపోతుంది. మనం నడుస్తుంటే అదీ నడుస్తుంది. మనం కూర్చొంటే అదీ కూర్చొంటుంది. మన కూడానే ఉంటుంది. కొంతమంది హాయిగా రాత్రి నిద్రపోతారు వెలుగు వచ్చేటప్పటికి మరణిస్తారు. అంటే నిద్రట్లో చావు ఎక్కడ ఉంది అంటే మన కూడానే ఉంది. అయితే మన అందరికి దుఃఖ కారణం ఏమిటి? దేహబుద్ధి కారణం. పుణ్యం చేస్తే మనకు సుఖం వస్తుంది కాబట్టి సంతోషం వస్తుంది కాబట్టి పుణ్యం చేయమన్నారు. పాపం చేస్తే మనకు దుఃఖం వస్తుంది కాబట్టి పాపం చేయవద్దు అన్నారు. అయితే ఈ పుణ్యం, పాపం రెండు కూడా మనసు యొక్క పరిధిలోనివే. పుణ్యం మనసు యొక్క పరిధి లోనిదే. పాపం మనసు యొక్క పరిధి లోనిదే. మీకు గాఢనిద్రలో మనసు లేదు కాబట్టి అక్కడ పుణ్యం లేదు, పాపం లేదు. ఈ పుణ్య పాపాలు కూడా మనసుకి సంబంధించిన విషయాలు. అన్నీ మనసులోనే ఉన్నాయి. నిద్రట్లో మీకు మనసు లేదు కాబట్టి

ఇవి ఏమీ లేవు.

ఈరోజు ఎవరో ప్రశ్న అడిగారు నన్ను వేంపాడు వచ్చాక, నాకు ఆత్మ తెలియటం లేదండి, ఆత్మ తెలుసుకోవాలని ఉందండి. మనం ఆత్మను తెలుసుకోవడానికే సాధన చేస్తున్నాము. ఆత్మను తెలుసుకునే వాడు ఎవడు? ఆత్మను తెలుసుకోవాలి అని వీడు అనుకుంటున్నాడు. అంటే మీరు రెండుగా ఉన్నారా? ఒకటిగా ఉన్నారా? మనం ఆత్మే. కాని ఆత్మను తెలుసుకునేవాడు ఒకడు ఉన్నాడు అనుకుని వాడి తోటి మనం సాధన చేస్తున్నాము, జపం చేస్తున్నాము. కాని ఆత్మను తెలుసుకునేవాడు ఎవడు? ఆత్మను తెలుసుకోవాలి అని అనుకుంటున్నాం అంటే మీలో ఒక ఆత్మ ఉందని, తెలుసుకునేవాడు ఒకడు అని ఇద్దరు అయిపోయారు అక్కడ, ఇద్దరు లేరు. ఆత్మ ఒక్కటిగా ఉంది కాని రెండుగా లేదు. భగవంతుడు ఏమన్నాడు? మీ హృదయంలో నేను ఆత్మగా ఉన్నాను అని చెప్పి ఊరుకోలేదు. ఆ ఆత్మ ఎవరు? నువ్వే అని చెప్పాడు. మరి ఆత్మ నువ్వే అని భగవంతుడు చెబితే, మనం ఈ దేహం నేను అనుకుంటున్నాం కారణం ఏమిటి? ఇది మీరు బాగా ఆలోచించాలి. భగవంతుడు ఏమి చెప్పాడు అంటే నువ్వు ఆత్మ అంటున్నాడు. అయితే భగవంతుడు అబద్ధం చెబుతాడా? ఆత్మ నీ హృదయంలోనే ఉంది. స్వర్గ రాజ్యం ఎక్కడో నీకు దూరాన లేదు. అది నీ హృదయంలోనే ఉంది. మీ మనసుని ప్రశాంతం చేసుకుంటే, మీ మనసు కనుక నిర్మలం అయితే మీ హృదయంలోని ఆత్మ మీకు అందుతుంది. Be still and know that I am God దీనికి శ్రీ కృష్ణుడు గీతలో ఏమి చెప్పాడు అంటే అహం ఆత్మా గుడాకేశ, అందరి హృదయాల్లో నేను ఆత్మగా ఉన్నాను. అని చెప్పి ఆ ఆత్మ ఎవరు? నువ్వే అని భగవంతుడు చెప్పాడు. భగవంతుడు నిజం చెప్పాడా? అబద్ధం చెప్పాడా? మరి భగవంతుడు చెప్పినట్టు మనం ఆత్మే కనుక అయితే నేను దేహాన్ని అనుకుంటున్నానా? ఆత్మను అనుకుంటున్నానా? దేహాన్ని అనుకుంటున్నాను. భగవంతుడు నువ్వు ఆత్మవి అని చెబితే, నేనుదేహాన్ని అని ఎందుకు అనుకుంటున్నాను? ఏవండి దేహం పుట్టినప్పుడు నేను పుట్టాను అనుకుంటున్నాను. దేహం పెరుగుతుంటే నేను పెరుగుతున్నాను అనుకుంటున్నాను. దేహం చనిపోతుంటే నేను చనిపోతున్నాను అంటున్నాడు అంటే ఎవరు చనిపోతున్నారు? దేహం చనిపోతోంది. దేహం చనిపోయినప్పుడు నువ్వు చనిపోతున్నాను అనుకుంటున్నావు. అంటే దేహం నువ్వు అనుకుంటున్నావు. అయితే భగవంతుడు నువ్వు ఆత్మవి అని చెబితే, దేహానివి నువ్వు అని ఎందుకు అనుకుంటున్నావు? నువ్వు అనుకునేది రైటా? భగవంతుడు చెప్పింది రైటా? ఒకవేళ భగవంతుడు చెప్పింది అబద్ధం అనుకుందాం. నువ్వు చెప్పిందే నిజం అని అనుకుందాం. దేహాన్ని నేను అని మనం అనుకుంటున్నాము. ఇదే నిజం అని అనుకుందాం.

ఇదే నిజం అయితే దుఃఖం ఎందుకు వస్తోంది? మీలో దుఃఖం లేనివాళ్లు ఎవరైనా ఉన్నారా? పండితుడికి దుఃఖం వస్తుంది, పామరుడికి దుఃఖం వస్తుంది. ధనవంతుడికి దుఃఖం వస్తుంది, ధనం లేనివాడికి దుఃఖం వస్తుంది. అందరికీ ఏదో ఒక రూపంలో దుఃఖం వస్తుంది. దేహం నువ్వు అని అనుకునేది నిజం అయితే నిజం లోంచి దుఃఖం రాదు, అబద్ధం లోంచి దుఃఖం వస్తుంది. అసత్యం లోంచి దుఃఖం వస్తుంది. కానీ నిజం లోంచి దుఃఖం రాదు, సత్యం లోంచి దుఃఖం రాదు, ఆత్మ లోంచి దుఃఖం రాదు. నా దేహం చుట్టూ నేను తిరుగుతున్నాను, ఈ దేహం నేను నేను అనుకుంటున్నాను. ఇదే కనుక యధార్థం అయితే నాకు దుఃఖం రావటానికి వీలు లేదు. నా మనసులో ఉన్న భావాలు అన్నీ నేను అనుకుంటున్నాను. అదే గనుక నిజం అయితే నాకు దుఃఖం రావటానికి వీలు లేదు. ఏదైతే కాదో, అది నేను అనుకుంటున్నాను కాబట్టి నాకు దుఃఖం వస్తోంది. నా దేహం నేను అనుకుంటున్నాను అది నేను కాదు అందుచేత నాకు దుఃఖం వస్తోంది. నా మనసు నేను అనుకుంటున్నాను. అది నేను కాదు అందుచేత నాకు దుఃఖం వస్తోంది. భగవంతుడు ఏమి చెబుతున్నాడు అంటే ఈ దేహమే నువ్వు అనుకో, స్మశానంలో కాలిపోయే వస్తువే కనుక నువ్వు అయితే అక్కడితోటి నీ యాత్ర ఆఖరు. నువ్వు దేహానివి కాదు కానీ ఈ దేహమే నేను అనుకొంటున్నావు. ఈ దేహబుద్ధి పోవటం కోసమే తపస్సు,యోగం. భక్తియోగం, జ్ఞానయోగం, ధ్యానయోగం, కర్మయోగం, ఈయోగం ఎందుకు? నీ దేహబుద్ధిని పోగొట్టి నీకు ఆత్మ బుద్ధిని కలుగజేయటం కోసమే యోగం, నువ్వు ఏదైతే కాదో అది నువ్వు అనుకుంటున్నావు కాబట్టి దానితోటి ఉన్న సంబంధాన్ని నీకు విడదీసేదే యోగం. దానితోటి ఉన్న సంబంధాన్ని నీకు నరికేదే యోగం, ఏది? అసత్యం తోటి నీకు ఉన్న సంబంధాన్ని నరికేదే యోగం. ఆయోగం వల్ల నీకు సుఖం వస్తుంది. యోగం వల్ల నువ్వు సిద్ధిని పొందుతావు. అందుకే కృష్ణుడు భక్తియోగం, జ్ఞానయోగం, కర్మయోగం, ధ్యానయోగం, ఈ యోగాలు అన్నీ మీకు గీతలో ప్రతిపాదించాడు.

**ధర్మ, అర్ధ, కామ, మోక్షాలను పురుషార్థాలు అంటారు.**
**సర్వసాధారణంగా అందరూ ధర్మం, మోక్షం వదిలేస్తారు.**
**మధ్యలో ఉన్న అర్ధ, కామాలు అంటే అందరికీ ఇష్టమే.**
**యదార్థం చెప్పాలంటే మోక్షం ఒక్కటే నిజమైన పురుషార్థం.**
**ఆ మోక్షాన్ని పొందటం కోసం నీ మనసు ఎంతవరకు అటు**
**ప్రయాణం చేస్తోందో చూసుకో.**



మన మనసుకి ఒక క్రమశిక్షణ అవసరం. మన దేహానికి ఒక క్రమశిక్షణ అవసరం. దేహానికి క్రమశిక్షణ లేకపోతే, మనసుకి క్రమశిక్షణ లేకపోతే మనకున్న సత్యవస్తువును మనం తెలుసుకోలేము. మనం అందరం కూడా మన అలవాట్లకి బానిసలం. మన శరీరం మరణిస్తుంది కాని మన అలవాట్లు మటుకు మరణించవు. అలవాట్లు మన కూడానే వస్తాయి. మన అలవాట్లే మనల్ని బంధిస్తున్నాయి అవే సంకెళ్ళు. నేను పది సంవత్సరాలు నుంచి సిగరెట్టు కాలుస్తున్నాను అనుకోండి, సిగరెట్టు మానేస్తే ఆరోగ్యానికి మంచిది అని డాక్టర్లు చెబుతారు అనుకోండి, ఆరోగ్యం అని చెప్పినప్పటికీ నేను ఆ సిగరెట్టు మానుకోలేను. అయితే దేహబుద్ధి అనే అలవాటు నాకు ఎంతకాలం నుంచి ఉంది అది నేను ఎలా మానగలను? దేహానివి నువ్వు అనుకోవడం నిజం కాదు. ఒక అలవాటును బట్టి నువ్వు అనుకుంటున్నావు. ఎప్పటి నుంచి అనుకుంటున్నావు? ఎంతో కాలం నుంచి అనుకుంటున్నావు. ఎన్నో జన్మల నుంచి అనుకుంటున్నావు. ఇవాళ ఒక్కసారి నువ్వు దేహానివి కాదు అంటే నువ్వు కంగారు పడుతున్నావు. భగవంతుడు చెప్పేది నువ్వు అబద్ధం అనుకుంటున్నావు. అంగుళం అంగుళానికి మనకు దేహబుద్ధే. ఇప్పుడు నేను ఎక్కడ నుంచి వచ్చాను? జిన్నూరు నుంచి వచ్చాను. ఏవండీ జిన్నూరు నుంచి ఎవరు వచ్చారు? నా దేహం వచ్చింది. నేను వచ్చానా అసలు. ప్రతీది కూడా దేహబుద్ధి మీద ఆధారపడి మనం ఆలోచిస్తూ ఉంటాం. ఏది చదివినా దేహబుద్ధి తోటే చదువుతాం. దేహబుద్ధి తోటే ప్రతీ పని చేస్తాం. అందుచేత ఏ మనిషిని దుఃఖం విడిచిపెట్టదు. మీకు ఎంతకాలం అయితే దేహబుద్ధి ఉందో అంతకాలం శవాలని మోయాల్సిందే. ఇది రమణస్వామి చెప్పినటువంటి సూత్రం. శరీరం అంటే శవం. ఈ శవాన్ని నువ్వు మోసుకు తిరుగుతున్నావు. దీని ప్రాణం పోతే నలుగురు మోసుకు వెళతారు స్మశానానికి, అంటే ఈ శవాలు నీకు రోజు వస్తూనే ఉంటాయి. అందుచేత ఈ శవాలను ఎప్పుడూ మోయాల్సిందే. ఎంతకాలం? నీకు దేహబుద్ధి ఉన్నంతకాలం నీకు మరణం వస్తుంది, జన్మ వస్తుంది, మరల మరణం వస్తుంది, మరల జన్మ వస్తుంది. అందుచేత తప్పనిసరిగా నిన్ను దుఃఖం కూడా విడిచిపెట్టదు. ఎందుచేత నిన్ను దుఃఖం విడిచిపెట్టదు. అబద్ధాన్ని నిజం అనుకుంటున్నావు కాబట్టి నిన్ను దుఃఖం విడిచిపెట్టదు, అశాంతి విడిచిపెట్టదు, ఆందోళన విడిచిపెట్టదు, కష్టం విడిచిపెట్టదు, నష్టం విడిచిపెట్టదు.

సోదరమహాశయులారా! ఒక్క విషయం మీరు జ్ఞాపకం ఉంచుకోండి. మతం పేరు మీద చెప్పేవిషయాలు కూడా నూటికి యాభై శాతం అబద్ధాలు. అందరిలోనూ ఆత్మ ఉన్న మాట నిజం. దీన్ని ఆధారంగా చేసుకుని ఎన్నో కల్పించేస్తున్నారు మతాల పేరు మీద, అది హిందూమతం అవ్వనివ్వండి, క్రైస్తవమతం అవ్వనివ్వండి, బౌద్ధమతం అవ్వనివ్వండి,

ఇస్లాంమతం అవ్వనివ్వండి. అనవసరంగా మతం పేరు మీద ఉద్రేకాలు తెచ్చుకుని, ఆందోళన తెచ్చుకుని , ఆవేశాలు తెచ్చుకుని, మానసికమైన ఆరోగ్యం, శారీరకమైన ఆరోగ్యం పోగొట్టుకోవటమే కాని ఈ మతం పేరు మీద నూటికి యాభై అబద్ధాలు. అందుచేత అనవసర విషయాలకు వెళ్ళకండి. మీకు హృదయంలో ఆత్మ ఉన్న మాట నిజం. ఒక సత్య వస్తువు ఉన్న మాట నిజం. ఏ పరమేశ్వరుడు అయితే ఈ సృష్టిని అంతా నడుపుతున్నాడో, దాని అంశ, దాని శక్తి, మీ హృదయంలో కూడా ఉంది. మీ హృదయంలో ఉన్న శక్తి మీకు అర్థం కాకపోతే ప్రపంచాన్ని నడిపే శక్తి కూడా మీకు అర్థం కాదు. భగవంతుడు ఏమి చెబుతున్నాడు? నువ్వు ఆత్మవి అని చెబుతున్నాడు. పైగా ఆత్మకి మరణం లేదు అంటున్నాడు. ఆత్మ పుట్టలేదు. పుట్టింది పెరుగుతుంది, పెరిగింది మరణిస్తుంది. మరి పుట్టింది ఎవరు? నేను పుట్టాను అనుకుంటున్నాడు ప్రతీ మనిషి, మరి పుట్టింది ఎవరు? ఈ నేను ఎవరు? నువ్వు చెప్పే నేను ఎవరు? ఈ దేహమే కనుక నిజం అయితే ఇరవై నాలుగు గంటలు నీకు దేహస్మృతి ఎందుకు లేదు. నీ మనస్సే కనుక నిజం అయితే ఇరవై నాలుగు గంటలు నీ మనసు ఎందుకు లేదు? నిద్రట్లో కూడా నీ మనసు నీకు ఉండాలి అదే కనుక నిజం అయితే, మీరు అందరూ ఆలోచించండి. ఆలోచన కూడా ఒక తపస్సే. మీరు వినటం ఒక్కటే కాదు. మీరు అందరూ ఆలోచించండి. ఆలోచించడం కూడా చాలా అవసరం. ఆలోచిస్తే అర్థం అవుతుంది. అర్థం అయితే మీకు జీర్ణం అవుతుంది. జీర్ణం అయితే మీ శరీరానికి, మీ మనసుకి, బలం చేకూరుతుంది. అందుచేత సబ్జెక్టు మీరు బాగా అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యండి.

నేను నేను అనే తలంపు వచ్చాకే నువ్వు దేవుడి గురించి ఆలోచిస్తున్నావు. లేకపోతే వ్యవసాయదారుడు వ్యవసాయం గురించి ఆలోచిస్తున్నాడు. వర్తకుడు వర్తకం గురించి ఆలోచిస్తున్నాడు. ఏది ఆలోచించినప్పటికి ఆలోచించేవాడు ఒకడు ఉండాలి. ఈ ఆలోచించేవాడి గురించి మీరు ఎప్పుడైనా ఆలోచించారా? మీరు అనేక విషయాలు ఆలోచిస్తున్నారు. లోకానికి సంబంధించిన విషయాలు, పరమేశ్వరుడికి సంబంధించిన విషయాలు, అనేక విషయాలు మీరు ఆలోచిస్తున్నారు రైటే, ఈ ఆలోచించేవాడు ఒకడు మీలో ఉన్నాడు. ఈ ఆలోచించేవాడు గురించి మీరు ఎప్పుడైనా ఆలోచించారా? రాముడి గురించి ఆలోచిస్తున్నారు రైటే, ఈ రాముడి గురించి ఆలోచించేవాడు ఎవడు? రాముడి వెనకాలో, కృష్ణుడు వెనకాలో, యేసుక్రీస్తు వెనకాలో మనం వెళ్ళిపోతున్నాం కాని మీ లోపలికి మీరు ఎందుకు వెళ్ళరు? అది రమణమహర్షి అడిగేది. మీ ఆదర్శాలు మీరు విడిచిపెట్టు కోవక్కరలేదు. మీకు ఆ రూపం నచ్చింది మీరు ఆరాధన చేయండి. ఆరాధన విడిచిపెట్టమని

చెప్పటం లేదు. కాని ఎవరొకరి కూడా వెనకాల పడి వెళ్ళే మీరు లోపలికి వెళ్ళకపోతే మీకు నిజం తెలియదు. లోపలకి వెళ్ళండి. Down deep down మీ హృదయంలో పరమాత్మ ప్రకాశిస్తోంది. మీకోసం ఎదురుచూస్తోంది. అయితే మీరు లోపలికి వెళ్ళకపోతే ఎవరికో ఒకరికి అనుయాయుడిగా ఉన్నంత మాత్రం చేత, అనుకరణ వల్ల మటుకు మీకు నిజం తెలియదు. మీరు లోపలకి వెళ్ళండి. ఎవడో ఒకడి వెనకాల పరుగు పెట్టడం కాదు మీరు చేయవలసింది. మీరు లోపలకి వెళ్ళండి. నేను మీ హృదయంలో ప్రకాశిస్తున్నాను అని భగవంతుడు చెబుతున్నాడు. మీ మనసుని కనీసం ఒక అంగుళం అయినా లోపలకి దింపండి. మీరు లోపలకి వెళ్ళకుండా మీ హృదయంలోకి మీరు ప్రవేశించకుండా, ఎక్కడైతే సత్యం ప్రకాశిస్తోందో అక్కడకు మీరు వెళ్ళకపోతే మీకు సత్యం తెలియదు. మీరు మంచి పనులు చేస్తే మీకు పుణ్యం వస్తుంది. చెడ్డ పనులు చేస్తే పాపం వస్తుంది. ఇదంతా మనసుకి సంబంధించిన విషయమే. ఇవన్నీ ప్రకృతికి సంబంధించిన విషయాలే. అయితే మీరు లోపలకి వెళ్ళడం కోసం మీరు శ్రవణం చెయ్యాలి, మననం చెయ్యాలి, ఆత్మ గురించి ప్రీతి పెంచుకోవాలి. ఆత్మ గురించి ఇష్టం పెంచుకోవాలి. ఆత్మ గురించి ఆప్యాయత పెంచుకోవాలి. ఎవరైతే మీరుగా ఉన్నారో, ఆ వస్తువు మీకు తెలియబడే వరకు మీకు అశాంతి విడిచిపెట్టదు. ఏ ఆత్మ అయితే మీరు అని భగవంతుడు గీతలో చెప్పాడో, ఆ వస్తువు మీకు తెలిసే వరకు మిమ్మల్ని ఆవేదన విడిచిపెట్టదు, ఆందోళన విడిచిపెట్టదు.

మనం అందరం పనులు చేస్తున్నాము. కోరిక లేకుండా పని చేస్తున్నామా మనం? కోరిక తోటి మనం పని చేస్తున్నాము. భగవంతుడు నువ్వు కోరిక విడిచిపెట్టు అంటే కోరిక మనలో ఎవరు విడిచిపెట్టలేకపోతున్నాం. ఏ పని చేసినా కోరిక తోటే మనం పని చేస్తున్నాము. కోరిక వల్లే దుఃఖం వస్తుంది. ఇదే కర్మ సముద్రం. స్వార్థాన్ని చంపుకోవడానికి ఎవడు ఇష్ట పడడు. స్వార్థాన్ని విడిచిపెట్టకుండా దేవుడిని తెలుసుకోవడానికి చేసే ప్రయత్నం అంతా వృధా, వృధా, వృధా. ఎక్కడైతే స్వార్థం లేదో అక్కడ దేవుడు ఉన్నాడు. కాని స్వార్థాన్ని విడిచిపెట్టడానికి మనకి ఇష్టం లేదు. స్వార్థాన్ని మనం విడిచిపెట్టకుండా దేవుడిని పట్టుకోవడానికి మనం ప్రయత్నం చేస్తున్నాము. ఇలా దేవుడు ఎన్నడూ దొరకడు. దేవుడు నీ హృదయంలో ఉన్నాడు. ప్రత్యక్షంగా ఉన్నాడు. ఎప్పుడూ ఉన్నాడు. అయితే స్వార్థంలోంచి ఎప్పుడైతే నువ్వు విడువడ్డావో, స్వార్థాన్ని ఎప్పుడైతే నువ్వు వదులుకున్నావో, అప్పుడు నీలో ఉన్న ఆత్మ వ్యక్తం అవుతుంది. అయితే ఈ స్వార్థం ఎంతవరకు వచ్చింది అంటే మీరు చేసే పుణ్యాలు కూడా మీరు స్వార్థం కోసమే చేస్తున్నారు. మిమ్మల్ని మరచిపోయి మీ దేహాన్ని మరచి పోయి, మీ మనసుని మరచిపోయి, మీ ఇంద్రియాలని మరచిపోయి, మీ పర లోకాన్ని మరచిపోయి మీరు ఒక్క మంచిపని మీ

జీవితంలో చేశారా? ఈ మంచిపని చేస్తే పరలోకంలో నాకు ఈ సుఖం వస్తుంది. ఆ సుఖాన్ని నేను పొందొచ్చు అని ఆశించి మీరు ఈ లోకంలో ఏదైనా పనులు చేస్తున్నారు కాని మిమ్మల్ని మరచిపోయి చేసిన పని ఒక్కటి ఉందా మీ జీవితంలో, మీరు ఆలోచించండి. మంచి పని చేశాం అని మీరు అనుకుంటున్నారు ఆ మంచి పని వల్ల కూడా మీరు ఏదో ఆశిస్తున్నారు. ఏదో పుణ్యమో, ఏదోఒకటి ఆశిస్తున్నారు. అది కూడా ఆశించకుండా మీరు చేసిన పని జీవితంలో ఒక్క పని ఉందా? మిమ్మల్ని మరచిపోయి మీ జీవితంలో ఎదుటి వ్యక్తికి ఒక్క వ్యక్తికి సహాయపడ్డారా మీరు?


స్వార్థాన్ని విడిచిపెట్టి నిన్ను నువ్వు మరచిపోయి, ప్రతిఫలం ఆశించకుండా కనీసం నీ జీవితంలో ఒక్క జీవుడికి నువ్వు సహకరించావా? పని పనికోసం మీరు ఎప్పుడైనా చేస్తున్నారా? ప్రేమ ప్రేమకోసం మీరు ఎవరిని అయినా ప్రేమించారా? అంటున్నారు రామకృష్ణుడు. అంటే ప్రతిఫలాన్ని ఆశించే మనం పుణ్యం చేస్తున్నాము. అందుచేత మనకి పుణ్యం రావచ్చు. అయితే పుణ్యాన్ని ఏమి చేస్తాం మనం మళ్ళీ అనుభవిస్తాం. అనుభవించినపుడు వాసన ఏర్పడుతుంది. ఏదైనా సరే మనం పుణ్యాన్ని అనుభవిస్తుంటే మనకి వాసన ఏర్పడుతుంది. మన వాసనే మళ్ళీ తలంపు కింద పుడుతుంది. ఇక్కడ ఇంతమంది కూర్చొన్నాము అందరికి తలంపులు లోపల నుంచి వస్తున్నాయా? బయట నుంచి వస్తున్నాయా? మీరు ఆలోచించండి. ప్రతీ వాడికి ఆలోచన వస్తుంది. ప్రతీ వాడికి తలంపు వస్తుంది. మీకు వచ్చే తలంపు కాని మీకు వచ్చే ఆలోచన కాని మీకు బయట నుంచి వస్తుందా? లోపల నుంచి వస్తుందా? లోపల నుంచే వస్తుంది. లోపల అంటే ఎక్కడ నుంచి వస్తుంది. మీ హృదయంలోంచే వస్తుంది. మీ లోపల నుంచే వస్తుంది. బయట నుంచి రావటం లేదు. భగవంతుడి దగ్గర నుంచే ఇవన్నీ వస్తున్నాయి. నీకు తలంపు వస్తుంది. ఆ తలంపు పుట్టిన చోటు కనుక నీకు తెలిస్తే నీకు భగవంతుడు ఎవడో తెలుస్తాడు. మూలం భగవంతుడే. భగవంతుడి లోంచే మీకు ఆ తలంపు వస్తుంది, ఆలోచన వస్తుంది. మూలం భగవంతుడే. లోపల నుంచి వచ్చే ప్లేస్ ఒకటి ఉంది, ఆ చోటు నువ్వు గ్రహించే వరకు, అది గుర్తించే వరకు నీకు భగవంతుడు అంటే ఏమిటో తెలియదు. అందుచేత మీ యొక్క మూలం దేవుడే. నువ్వు నీ తల్లి గర్భం నుండి బయటకు రావచ్చు, కాని నీకు మూలం దేవుడే. నువ్వు దేవుడి దగ్గర నుంచే వచ్చావు అందుచేత రమణస్వామి చెప్పేవారు, ఏవండీ నన్ను ఏ దారిన వెళ్ళమంటారు అంటే వచ్చిన దారిన వెళ్ళు అనేవారు ఆయన, అంటే మనం ఎక్కడ నుంచి వచ్చాం? దేవుడి దగ్గర నుంచి వచ్చాం. మళ్ళీ వచ్చిన దారి నుంచి వెనక్కి వెళితే దేవుడి దగ్గరకే వెళతాము. ఏవండీ నన్ను ఎలా బ్రతకమంటారు

అని ఒకరు అడిగితే చచ్చిన వాడి వలే బ్రతుకు అన్నారట చచ్చిన వాడి వలే బ్రతకడానికి ఈ అహంకారం ఊరుకుంటుందా. నువ్వు చచ్చిన వాడి వలే బ్రతుకు నీకు జ్ఞానం వస్తుంది.

మన శరీరాలకి యవ్వనం వచ్చింది కాని మన మనసు ఇంకా వికసించలేదు. మానవజన్మ ఇదొక అవకాశం. మనకున్న బలహీనతలు నుండి బయట పడటానికి ఈ అవకాశం మనకి ఇచ్చారు. పరీక్షలు ఎందుకు పాస్ అవ్వడానికి ఒక అవకాశం, పరీక్షలు రాయకపోతే ఫెయిల్ అయిపోతారు. అంతకంటే పై క్లాసులోకి రావటానికి పరీక్షలు ఒక అవకాశం. అలాగే డబ్బు సంపాదించేవాడికి కూడా అనేక అవకాశాలు వస్తాయి. అవకాశం పట్టుకున్నవాడు డబ్బు సంపాదిస్తాడు లేకపోతే వాడు డబ్బు సంపాదించలేడు. మనకి ఈ అవకాశం వచ్చింది, మానవ జన్మ అనేది ఒక అవకాశం. అయితే ఎందుకు ఈ అవకాశం? ఏది అయితే మనం అయ్యి ఉన్నామో ఆ ఆత్మని తెలుసుకోవటానికి ఏ బలహీనతలు మనకి అడ్డు వస్తున్నాయో, ఆ బలహీనతలని తొలగించుకోవడానికి ఈ మానవజన్మని అవకాశంగా తీసుకుని వాటిని తొలగించుకొన్నవాడు జ్ఞాని అవుతాడు. ఈ అవకాశాన్ని విడిచిపెట్టు కున్నాము అనుకోండి ఇంక మనకి అవకాశం వస్తుందో రాదో చెప్పలేము వచ్చినా బాగుపడతామో, లేదో చెప్పలేము. దీపం ఉండగా చదువుకోమంటే చదువుకోలేని వాడు దీపం ఆరిపోయిన తరువాత వాడు చదువుకుంటాడా? హిందూమతంలో తరతరాల నుంచి అలవాటు పడిపోయింది ఏమిటంటే పూజ. పూజ కూడా మంచిదే. నాలుగు పువ్వులు తీసుకొచ్చి దేవుడి పటం దగ్గర పెట్టేయవచ్చు. ఏదో నాలుగు మంత్రాలు చదవవచ్చు. అన్నింటికంటే తేలికైన పని ఏమిటంటే పూజ. మన అందరికి పూజే దేవుడు. పూజకి అలవాటు పడిపోయాము. చేయండి మంచిదే అయితే మీలో ఉన్న బలహీనతలు లోంచి మీ పూజ కాని, జపం కాని , ధ్యానం కాని బయటకు రావటానికి సహకరించిందా? అది చూసుకోండి. వెనకో డాక్టరు గారు అన్నారట ఏవండీ నా పొరపాటు ఏమి లేదు ఆపరేషన్ చాలా బాగా చేశాను, కాని మనిషి మటుకు చచ్చిపోయాడు అన్నాడట. మరి నువ్వు చేసే పూజ, నువ్వు చేసే జపం, నువ్వు చేసే ధ్యానం చాలా బాగా చేస్తుంటే ఏ బలహీనత నీ హృదయం నుండి బయటకు వచ్చింది? మనిషి పుట్టినప్పుడు ఒక ఇరవై బలహీనతలు తోటి పుడితే మరణించే లోపులో మీరు పూజ చేస్తారో, జపం చేస్తారో, ఏదోఒకటి చేయండి, మీరు మరణించే లోపులో కనీసం ఒక్క బలహీనత తగ్గించుకుని పందొమ్మిది బలహీనతలు తోటి మీరు మరణించండి. అప్పుడు ఆధ్యాత్మికంగా మీరు అభివృద్ధిలోకి వచ్చినట్టే. ఎందుకు ఈ అవకాశాలను మీరు ఉపయోగించుకోరు.

మనకు బలహీనతలు అన్నీ ఎక్కడ నుంచి వచ్చాయి? పూర్వ జన్మలో మనం

చేసిన పనులే బలహీనతల కింద తయారు అయ్యాయి మనకి. అందరూ మనుషలే అంటున్నారు. మరి అందరూ మనుషలే అయితే అందరికి ఒకే ఆలోచన ఎందుకు రావటం లేదు. ఇక్కడ ఇంతమంది కూర్చొన్నాము ఎవరి ఆదర్శాలు వారివి, ఎవరి ఆకాంక్షలు వారివి, ఎవరి తలంపులు వారివి, ఎవరి ఊహలు వారివి, అందరికి ఒకే తలంపు ఎందుకు రావటం లేదు? మన పూర్వ జన్మలు వేరు, మన పూర్వ జన్మల్లో చేసిన పనులు వేరు. మనం పూర్వ జన్మలో ఏ పని అయితే చేశామో ఆ పనే వాసన కింద మన హృదయంలో ఉండిపోయింది. ఆ వాసనే తలంపు కింద వస్తుంది. తలంపే మళ్ళీ మాటలావస్తుంది. మాటను బట్టి పని చేస్తున్నాము. మీకు మాట వస్తోంది అనుకోండి తలంపు లేకుండా మీకు మాట వస్తుందా? తలంపు వచ్చాక మీకు మాట వస్తుందా? చెప్పండి. ఆలోచన వచ్చాక పని చేస్తున్నారా? ఆలోచన రాకుండా పని చేస్తున్నారా? ఆలోచన వచ్చాకే పని చేస్తున్నారు. అందుచేత మీరు మంచి పని చెయ్యాలి అంటే మీ నోటి నుండి మంచి మాట రావాలి అంటే ఆలోచన నియంత్రించుకోవాలి. మీ ఆలోచన మీ స్వాధీనంలో ఉందా? నా తలంపు నా స్వాధీనంలో లేదు. నా ఆలోచన నా స్వాధీనంలో లేదు. నేను దేశాన్ని ఉద్ధరించడానికి ప్రయత్నం చేస్తున్నాను. నా తలంపు ఎక్కడ నుంచి వస్తుంది? వాసన లోంచి తలంపు వస్తుంది. తలంపు లోంచి పని చేస్తాం. అది చెడు తలంపు అవ్వనివ్వండి, మంచి తలంపు అవ్వనివ్వండి, వాసన ఎక్కడ నుంచి వచ్చింది? మన హృదయం లోంచే వచ్చింది. అయితే ఆ వాసన ఉన్నట్టు మనకు తెలియదు. వాసన తలంపుగా మారి మన బ్రెయిన్ లో కనిపించినప్పుడు కాని మనకు తెలియదు. మనం ఏది చేసినా కోరిక తోటి పని చేస్తాం, నువ్వు కోరిక తోటి పని చేస్తే నీకు జ్ఞానం రాదు. నిన్ను నువ్వు మరచి పోయి ఏదైతే మంచి అని భగవంతుడు చెప్పాడో, నీ కోరిక తోటి నిమిత్తం లేకుండా దానిని చెయ్యి, ఫలితం రావచ్చు, రాకపోవచ్చు అది వేరే విషయం. ఫలితం భగవంతుడు ఇవ్వను అని చెప్పలేదు. ఫలితం కోసం మిమ్మల్ని ఎదురుచూడొద్దు అని చెప్పాడు. మనం ఫలితం



**నీ దేహ ప్రారబ్ధాన్ని బట్టి నువ్వు ఏ తల్లి కడుపులో పుట్టాలో, ఏ గ్రామంలో ఉండాలో, ఏ రోజు నువ్వు మరణించాలో నిర్ణయింప బడుతుంది. నీ జీవితంలో వచ్చే కష్టాలు-నష్టాలు, అదృష్టం దురదృష్టం, నీ పూర్వజన్మ సంచితాన్ని బట్టి నిన్ను వెంటాడు తుంది. మనిషిని నీడలాగ నీ ప్రారబ్ధం నిన్ను వెంటాడుతుంది.**

ఆశించకపోతే రాదు అనుకుంటాం. దానంతట అది వస్తుంది అయితే మనం ఆశించకూడదు. ఆశించాము అంటే అజ్ఞానం పెరుగుతుంది.

మన అందరిలోనూ జ్ఞానం ఉంది, మన అందరి లోను సుఖం ఉంది. మన అందరి లోను శాంతి ఉంది. ఆ శాంతి నాకు అనుభవంలో లేదు. ఎందుచేత? నా అజ్ఞానం మూసేస్తోంది. సత్యవస్తువు నా హృదయంలో ఉంది. నా హృదయంలో ఉన్నది నాకు వ్యక్తం కావటం లేదు. ఎందుచేత? నా కోరికలు మూసేస్తున్నాయి. అంతేగాని వస్తువు లేదు అని కాదు. ఒకసారి రమణమహర్షి దగ్గరకు ఒక అబ్బాయి వచ్చాడు. అబ్బాయిని నీకు ఏమి కావాలి? అని అడిగారు భగవాన్. నాకు ఏమి అక్కర్లేదు అన్నాడట ఆ అబ్బాయి. అబ్బా! ఎంత కాలానికి దొరికావురా నా జాతి వాడవు అన్నారట భగవాన్. అందరూ అన్నీ అడుగుతున్నారు కాని నువ్వు నాకు ఏమి అక్కర్లేదు అంటున్నావు ఎంత కాలానికి దొరికావు నా జాతి వాడవు అన్నారు. నిరంతరం మీకు మీరు జ్ఞాపకం వస్తున్నారా? దేవుడు జ్ఞాపకం వస్తున్నాడా? మన శరీరమో మన మనస్సో మనకి జ్ఞాపకం వస్తుంది. మీకు దేవుడు మీద నిజంగా ఇష్టం ఉంటే మీకు దేవుడు ఎందుకు జ్ఞాపకం రావటం లేదు. దేవుని జ్ఞాపకం పెట్టుకోవడానికి మీకు సాధన కావాలా? అంటే మీకు ఇష్టం లేదు అన్నమాట. ఇది ఏమైనా న్యాయంగా ఉందా? మీ మనవల్ని, మీ పిల్లల్ని జ్ఞాపకం పెట్టుకోవడానికి మీకు సాధన అక్కర్లేదు అస్తమాను వాళ్ళు జ్ఞాపకం వస్తూ ఉంటారు, ఎందుచేత అది మీకు ఇష్టమైన పని. దేవుడు అంటే మీకు ఇష్టం లేదు కాబట్టి సాధన చేయమంటున్నారు. ఇష్టం లేదు కాబట్టి మీరు కష్టపడి జ్ఞాపకం తెచ్చుకోవాల్సి వస్తుంది. అయితే మీకు నిజంగా ఇష్టం అయితే కష్టం ఎందుకు ఇక్కడ? ఇష్టం ఉన్న చోట కష్టం ఉండదు, ఇష్టం లేని చోట కష్టం ఉంటుంది. అంటే దేవుడు అంటే మీకు నిజంగా ఇష్టం అనుకోండి మీకు నిరంతరం భగవంతుడు జ్ఞాపకం ఉండాలి. అయితే మీకు అందరికి ఇష్టమే, నోటి తోటి ఇష్టం లోపల హృదయం తోటి కాదు. నోటి తోటి దేవుడు ఉన్నాడు అని చెబుతున్నారు. మళ్ళీ హృదయం తోటి కాదు అంటున్నారు. ఏ మాట అయితే మనం నోటి తోటి చెబుతున్నామో ఆ మాట హృదయం తోటి కాదు అంటున్నాం. ఒక అరుణాచలం జ్ఞాపకమే చాలు మీకు మోక్షం వస్తుంది. ఆ జ్ఞాపకం ఏది? మరి మీకు దేవుడు ఇష్టం అయితే మీకు నిజంగా ఎందుకు జ్ఞాపకం ఉండటం లేదు? మీకు అందరికి ఏది జ్ఞాపకం వస్తుంది? మీకు ఏది అయితే ఇష్టమో, అదే మీకు జ్ఞాపకం వస్తుంది. దేవుడు అంటే మీకు ఇష్టం లేదు కాబట్టి, దేవుడు జ్ఞాపకం రావటం లేదు. ఆయన మీద మీకు ఇష్టం ఉందో లేదో తెలుసుకోలేని అమాయకుడా దేవుడు.

భగవంతుడు ఒక మాట చెప్పాడు. జ్ఞానం తోటి సమానమైన వస్తువు కాని, జ్ఞానానికి

మించిన వస్తువు కాని ఈ లోకంలో లేదు, పరలోకంలో కూడా లేదు. ఆ జ్ఞానం ఎవరు? నువ్వే. నీ స్వరూపమే జ్ఞానం. ముందు మీరు జ్ఞానాన్నే గమ్యంగా పెట్టుకోండి. మనం ఏదైనా ప్రయాణం చేస్తున్నాము అంటే ఫలానా చోటుకి వెళ్ళాలి అనే ఇంటినుండి బయలుదేరుతాము. ఏవండీ మీరు ఎక్కడికి వెళుతున్నారు అంటే మాకు తెలియదు అని ఎవరైనా చెబుతారా? మీ గమ్యం ఏమిటి? జ్ఞానాన్నే మనం గమ్యంగా పెట్టుకోవాలి. అందుచేత మనం చేత్తోటి ఒక పని చేసినా, చెవులతోటి ఒక మాట విన్నా, కంటి తోటి ఏదైనా చూసినా, నాకు ఏదైనా తలంపు వచ్చినా, అది జ్ఞానాన్ని సంపాదించటం కోసమే అయి ఉండాలి. జ్ఞానాన్ని గమ్యంగా పెట్టుకుని మనం పని చేస్తే జ్ఞానం వస్తుంది. జ్ఞానమా, పుణ్యమా మీకు కావలసింది. మీకు దేవుడు కావాలా? దేవుడు ఇచ్చే వరాలు కావాలా? మీకు దేవుడు కావాలి అంటే దేవుడు దొరుకుతాడు కాని మీకు దేవుడు అక్కర్లేదు, ఏమి కావాలి? దేవుడు ఇచ్చే వస్తువులు మీకు కావాలి. ఒక ఊళ్ళో ఒక పంతులు గారు వచ్చి ఉపన్యాసం చెబుతున్నారు, ఈ పంతులు గారు ఏమి చెబుతున్నారు అంటే గుడిలో దేవుడు ఉన్నాడు, మీరు గుడిలోకి వెళ్లి నమస్కారం పెట్టుకోండి అని చెబుతున్నాడు. ఆడియన్స్‌లో ఒకడు లేచి ఈ ఊర్లో ఉన్న అందరికీ గుడిలో దేవుడు ఉన్నాడు అని తెలుసు, గుడిలో దేవుడు ఉన్నాడు అని, గుడిలో దేవుడు ఉన్నాడు అని చెప్పటానికి మీరు ఇంత కష్టపడి ఇన్ని మైళ్ల దూరం ప్రయాణం చేసి వచ్చారా అని అడిగాడు. శాస్త్రం ఏమి చెబుతోంది మీ హృదయంలో ఉన్నాడు దేవుడు అని చెబుతోంది. గుడిలో దేవుడు ఉన్నాడు అని మీకూ తెలుసు, నాకూ తెలుసు, అందరికీన తెలుసు. మరి గుడిలో దేవుడు ఉండి బయట లేకపోతే వాడు దేవుడు అవుతాడా? మీ హృదయంలో లేకపోతే దేవుడు అవుతాడా?

మనం అందరం చాలా పెద్ద మనుషులం. పెద్ద పెద్ద చదువులు చదువుకున్నాం. నాగరికతలు నేర్చుకున్నాం. సైన్సు పెరిగిపోయింది. టెక్నాలజీ పెరిగి పోయింది. కానీ మనకి రాళ్ళ మీద ఉన్న నమ్మకం హృదయంలో ఉన్న పరమేశ్వరుడి మీద లేదు. మీరు మీ గుండె మీద చెయ్యి వేసుకుని ఆలోచించండి. మీకు రాళ్ళ మీద ఉన్న నమ్మకం మీ హృదయంలో ఉన్న పరమేశ్వరుడి మీద ఉందా లేదా అని మీరు ఆలోచించండి. నన్ను నమ్మమని మీతో చెప్పటం లేదు. మీకు ఒక రాతి మీద ఉన్న నమ్మకం మీ మీద మీకు ఉందా? మీ మీద కనుక మీకు నమ్మకం కుదిరితే మీరు అందరూ ఈశ్వరుని స్వరూపం పొందుతారు. అంటే మీరు మంచి మాటలు వినాలి, వాటిని శ్రద్ధగా మననం చెయ్యాలి. విన్న విషయాలు మీ మనసులో తిప్పుకోవాలి, వాటిని ధ్యానం చేయాలి, భగవంతుడి నోటి లోంచి వచ్చిన మాటకి భగవంతుడికి భేదం లేదు. ఆయన చెప్పిన మాట భగవంతుడు వేరు కాదు. మాటే

భగవంతుడు. ఆ మాటని పట్టుకుని మనం భగవంతుడిని చేరుకోవాలి. అందుచేత ఎవరుమటుకు వారు మీ హృదయంలో ఏ బలహీనతలు ఉన్నాయో చూసుకోండి. పరిశీలనగా చూసుకోండి. కనీసం ఒక్క బలహీనతని మీరు బయటకి తీసేయడానికి ప్రయత్నం చెయ్యండి. మీకు దారి కనిపిస్తుంది. నేను ఒక అరటిపండు మీ చేతిలో పెడితే మీరు ఒక అరటిపండు నా చేతిలో పెడితే అది త్యాగం కాదు. నిజమైన త్యాగి ఎవరు అంటే వంద దురాలోచనలు మీ హృదయంలో ఉంటే ఒక్క చెడ్డ ఆలోచన విడిచిపెట్టండి అది త్యాగం. త్యాగి కాని వాడు జ్ఞాని కాలేడు. ఏది త్యాగం చేయవలసింది? నీ హృదయంలో ఉన్నటువంటి పరమేశ్వరుడిని తెలుసుకోవటానికి, ఏ దుష్ట ఆలోచనలు, ఏ కుయుక్తులు, ఏ కుతంత్రాలు, ఏ కుచేష్టాలు, ఏ దుర్వాసనలు నీకు అడ్డువస్తున్నాయో, వాటిని త్యాగం చెయ్యి, వాటిని విడిచిపెట్టు. ఒక చెడుతలంపుని మీరు విడిచిపెట్టండి, తరచుగా వచ్చే ఒక చెడుతలంపుని మీరు విడిచిపెట్టండి. దానిని త్యాగం చేయండి.

దేహం నువ్వు అని చెప్పటానికి భగవద్గీత చదవక్కరలేదు. ఏమండీ ఇపుడు అందరికి ఎవడి దేహం వాడికి అనుభవంలో ఉంది కదా, దీనికి ఉపనిషత్తులు చదవాలా, వేదం చదవాలా, భగవద్గీత చదవాలా ఏమి చదవనక్కరలేదు. నువ్వు ఆత్మవు, నువ్వు ఆత్మవు, కానీ దేహానివి అనుకుంటున్నావు. అందుచేత నువ్వు ఆత్మవు అని చెప్పటానికి శాస్త్రం వచ్చింది. నీకు తెలియని విషయం చెప్పటానికి శాస్త్రం వచ్చింది. నేను ఆత్మను అని భగవంతుడు చెబుతున్నాడు. యేసుక్రీస్తు చెప్పాడు, కృష్ణుడు చెప్పాడు, బుద్ధుడు చెప్పాడు, కానీ మనకు నమ్మకం ఎందుకు కుదరటం లేదు? ఆ మాట మీద విశ్వాసం ఎందుకు కుదరటం లేదు? దానికి ఒక్కటే కారణం - మన హృదయంలో ఉన్న పాపం. నా హృదయంలో పాపం ఉన్నప్పుడు మంచి మాటలు నేను వినలేను. నా హృదయంలో దోషం ఉన్నప్పుడు భగవంతుడు చెప్పే మాటలు మీద నాకు విశ్వాసం కలగదు. ఎందుచేత అంటే పాపం అనే బురదలో మనం ఉన్నాము. ఈ బురద లోంచి బయటకు రాలేకపోతున్నాం. అందుచేత భగవంతుడు చెప్పే మాటలు నిజం అయినప్పటికీ అబద్ధాల కింద కనిపిస్తాయి. మనం అనుకునే అబద్ధాలు అన్నీ నిజం అనుకుంటున్నాము. ఇదే రమణస్వామి చెప్పారు ఒక అబద్ధాన్ని ఎన్ని సార్లు నిజం అనుకున్నా అది నిజం అవ్వదు. నువ్వు అనుకోవచ్చు అది నిజం అని కాని అది నిజం అవ్వదు. అయితే ఈ బురద లోంచి ఎలా బయటకు రావటం? ఈ బురద లోంచి బయటకు రావాలి అంటే మనం చేపలా ఎదురు ఈదాలి. చేపలు ప్రవాహానికి ఎదురు ఈదుతూ ఉంటాయి. అదే విధంగా మన మనస్సు యొక్క ప్రవాహానికి ఎదురు ఈదాలి, ఎదురు ఈదితే మనోమూలంలోకి వెళతాము. ఎవడైతే పాపాన్ని జయించాలి అనుకుంటున్నాడో, వాడు మనసుకి ఎదురు ఈదాలి.

మనసు ఎంతసేపు ప్రకృతి లోకి లాగుతుంది. నీ మనస్సుని కాదు అని భగవంతుని వైపు ప్రయాణం చెయ్యాలి అదే ఎదురు ఈదడం అంటే.

మనస్సు ఎంతసేపు ఈ దేహం నాది ఈ దేహం నాది అంటూ ఉంటుంది. కాని నువ్వు ఆత్మవు, ఆత్మ వైపు తిరగటం లేదు. నిన్ను తిరగనివ్వదు ఆత్మ వైపుకి, తనమీద విచారణ చేయడానికి మనస్సు అంగీకరించదు. పుణ్యం చేయమంటే చేస్తుంది, దానాలు చేయమంటే చేస్తుంది, కాని తానెవరో తాను తెలుసుకోవడానికి అది ఇష్ట పడదు. అందుచేత ఏ సుఖం కోసం మీరు జీవితంలో ప్రయాణం చేస్తున్నారో, ఆ సుఖం మీ హృదయంలోనే ఉంది. ఏ శాంతి కోసం వెతుక్కుంటున్నారో ఆ శాంతి మీ హృదయంలోనే ఉంది. అది ఎక్కడో దురాన లేదు. నువ్వు దేహానివి కాదు, నువ్వు మనసువి కాదు, నువ్వు ఆత్మవి అని చెప్పటానికి శాస్త్రం వచ్చింది. ఎందుచేత అంటే మీకు నిజం తెలియటం లేదు. నిజం దగ్గరకు నిన్ను తీసుకెళ్ళటానికి శాస్త్రం వచ్చింది. నువ్వు అబద్ధంలో ఉన్నావు కాబట్టి అబద్ధం నుండి విడిపించి నిజం దగ్గరకు తీసుకు వెళ్ళటానికి శాస్త్రం వచ్చింది. అలా కాదు నేను అబద్ధం నుండి విడువడను అంటే నిజం దగ్గరకు వెళ్ళలేవు. నాకు జిన్నూరు వెళ్ళాలని ఉంది కాని వేంపాడు విడిచిపెట్టడం ఇష్టం లేదు, జిన్నూరు ఎలా వెళతాను? అదే విధంగా అజ్ఞానాన్ని త్యాగం చేయటం కాని, అజ్ఞానాన్ని విడిచిపెట్టడానికి కాని ఎవడికి ఇష్టం ఉండదు. నిజం తెలుసుకోవాలి, ఆత్మ తెలుసుకోవాలి. అజ్ఞానాన్ని విడిచిపెట్టకూడదు, జ్ఞానం తెలియాలి. అబద్ధాన్ని విడిచిపెట్టకూడదు, నిజం తెలియాలి. అహంకారాన్ని విడిచిపెట్టడానికి వీలు లేదు దేవుడు తెలియాలి. అహంకారం ఉండగా అహంకారానికే పరిమితం అయిన నేనుకి, ఈ మనస్సుకి పరిమితం అయిన నేనుకి, ఈ దేహానికే పరిమితం అయిన నేనుకి, ఆత్మ గురించి తెలియదు.

మనం అందరం నేను నేను నేను అంటున్నాం కృష్ణుడు కూడా నేను నేను నేను అన్నాడు గీతలో, అయితే కృష్ణుడు చెప్పిన నేనుకి, మనం చెప్పే నేనుకి తేడా ఏమిటి? మనం అనేది దేహగతమైన నేను, మనోగతమైన నేను, అహంకారగతమైన నేను, ఆయన చెప్పింది ఆత్మగతమైన నేను. నన్ను తెలుసుకో, నన్ను తెలుసుకో అర్జునా, నా యందు భక్తిగా ఉండు. నేను చెప్పిన మాటలు విశ్వసించు. నన్ను తెలుసుకోవడానికి నువ్వు ప్రయత్నం చెయ్యి అన్నాడు కృష్ణుడు. నన్ను తెలుసుకో నన్ను తెలుసుకో అంటే అక్కడ కృష్ణుడి పొట్ట, కృష్ణుడి కాళ్లు, కృష్ణుడి చేతులు తెలుసుకోమని కాదు, నన్ను అంటే ఆత్మను తెలుసుకోమని. కొంతమంది కృష్ణుడు ఫొటో, శివుడు ఫొటో దగ్గర పువ్వులు పెడతారు, కాయలు పెడతారు. మేము ఇవాళ కాయలు పెట్టాం, పువ్వులు పెట్టాం అంటారు. నీ పువ్వుల కోసం ఆయన కనిపెట్టుకొని ఉన్నాడా? దేవుడికి మనం పళ్ళు ఇవ్వటం ఎందుకు అంటే మనకి మానవజన్మ

ఇచ్చాడు, ఒక అవకాశం ఇచ్చాడు. దానికి కృతజ్ఞత చూపించటానికి మనం పళ్ళు ఇస్తున్నాం ఆయనకి, ఆయన ఈ పళ్ళు ఏమి చేసుకుంటాడు, పువ్వులు ఏమి చేసుకుంటాడు? మనం ఏదైనా ఒక పండు ఇస్తున్నాం అంటే కృతజ్ఞత చూపించటం కోసం. కొంతమందికి కృతజ్ఞత అంటే ఎలా ఉంటుందో తెలియదు. కృతజ్ఞత అంటే ఎలా ఉంటుందో తెలియని వాడు మరణిస్తే ఆ మనిషి యొక్క మాంసం కుక్కలకు, నక్కలకు కుడా తినాలని ఉండదట. భగవంతుడికి మనం కృతజ్ఞత తెలియ పరచటం కోసం పూజ చేస్తున్నాము, పళ్ళు పెడుతున్నాం, పుష్పాలు పెడుతున్నాం, ఎందుకు? ఈ దేహం ఈ అవకాశాలు మనకు ఇచ్చినందుకు. అయితే నువ్వు నిజంగా దేవుడి పట్ల కృతజ్ఞత చూపించాలి అంటే నువ్వు నిజాన్ని తెలుసుకో నిజంగా ఉండు, అప్పుడు నువ్వు దేవుడికి నిజంగా కృతజ్ఞత చూపించగలవు.

శరీరాలు మూడు శరీరాలు ఉన్నాయి. ఒకటి స్థూల శరీరం, దాని లోపల ఇంకొక శరీరం ఉంది సూక్ష్మ శరీరం, అంటే మనసు. ఈ నేను నేను అని చెప్పేది ఎవరు? శరీరం చెబుతుందా? శవాలని వల్లకాటిలోకి మోసుకు వెలుతుంటే, ఇదేమిటి అయ్యా నన్ను ఇలా వల్లకాటి దగ్గరకు మోసుకు వెళ్ళిపోతున్నారు అని ఏ శవం అయినా ఇప్పటివరకు అడిగిందా? లేదు. ఎందుచేత? ఆ శవంలో నేను నేను అని చెప్పేవాడు తప్పుకున్నాడు. అడిగేవాడు లేడు. ఈ దేహం నాది అని చెప్పేవాడు లేడు. అందుచేత అడగటం లేదు. రమణస్వామి ఏమన్నారు అంటే ఈ మైకు ఎంతో, ఈ గోడ ఎంతో, ఈ గది ఎంతో, ఈ దేహం కూడా అంతే. నేను నేను అని దేహం చెబుతుందా? దేహం చెప్పటం లేదు దేహానికి చెప్పే శక్తి ఉంటే శవం కూడా చెప్పాలి. మరి ఎవరు చెబుతున్నారు? దేహం లోపల ఉన్నటువంటి ఈ మనసు చెబుతుంది. దానిని ఏమంటారు? సూక్ష్మశరీరం అంటారు. యాతనా శరీరం అంటే మన యాతనలకి అదే కారణం. మీరు పూజ చేస్తున్నారు. జపం చేస్తున్నారు. ధ్యానం చేస్తున్నారు. మీ మనసు మీరు చెప్పినట్టు వింటుందా? లేదు. ఈ మనస్సును దేవుడు మింగడానికి వస్తే దేవుడిని మింగనిస్తారా మీరు? లేదు. ఎందుచేత? మనం అదే అనుకుంటున్నాం. ఈ మనస్సే నేను అనుకుంటున్నాను. అది యాతనా శరీరం, మీకు యాతనలకి అదే కారణం కాబట్టి యాతనా శరీరం అని పేరు పెట్టారు. ఇంకా దాని లోపల ఇంకో శరీరం ఉంది. దేహాలు మారొచ్చు, మనసులు మారొచ్చు, దానిలోపల ఇంకో శరీరం ఉంది. అది కారణ శరీరం. అది అజ్ఞానం. అజ్ఞానం తొలగనంతకాలం నిన్ను సృష్టి విడిచిపెట్టదు. నీ హృదయంలో ఉన్న అజ్ఞానం బయటకి వచ్చే వరకు నీకు మాయ దారి ఇవ్వదు. మీకు మోక్షానికి వెళ్ళటానికి రోడ్డు కనిపించదు.

సోదరమహాశయులారా భౌతికమైన లాభాలు మీకు అనేకం రావచ్చు. భౌతికంగా

మీరు ఎంతో అభివృద్ధిలోకి రావచ్చు. ఎన్నో achievements మీ జీవితంలో ఉండవచ్చు. కానీ మీరు అజ్ఞానం నుండి బయటకి రావడమే నిజమైన లాభం. ఎవడైతే తన అజ్ఞానాన్ని త్యాగం చేశాడో, అజ్ఞానం అనే సంకెళ్ళని బద్దలు కొట్టి దాని నుండి ఎవడైతే విడుదల అవుతాడో వాడే నిజమైన లాభాన్ని పొందుతాడు. అజ్ఞానం నుండి విడుదల పొందటం కంటే మించిన లాభం ఈ లోకంలో కాని, పరలోకంలో కాని లేనే లేదు. మీకు రూపాయలు ఉండవచ్చు, బంగారం ఉండవచ్చు, గౌరవాలు ఉండవచ్చు, అధికారాలు ఉండవచ్చు, మీకు మేడలు ఉండవచ్చు, మీకు సౌందర్యం ఉండవచ్చు, మీకు అంగ బలం ఉండవచ్చు, అర్థ బలం ఉండవచ్చు. మీకు అన్నీ లాభాలే ఉండవచ్చు. కానీ ఆత్మలాభం మీరు ఎవరైనా సంపాదించారా? ఆత్మలాభమే నిజమైన లాభం. దానికోసం మీరు ప్రయత్నం చెయ్యండి, ఒకవేళ మీకు ఫలించకపోతే బాధ పడకండి, కనీసం ఆ ప్రయత్నంలో మరణించండి. ఈశ్వరుడు మిమ్మల్ని అనుగ్రహిస్తాడు. ఈశ్వరుడు మిమ్మల్ని అజ్ఞానం నుండి విడిపించేలా చేస్తాడు. ఆత్మలాభం కంటే మించిన లాభం ఏదీ లేదు? ఒకవేళ ఆత్మే కనుక నిజం కాకపోతే భగవంతుడు నిజం కాదు అని చెప్పేవాడు. ఈ దేహమే కనుక నిజం అయితే ఇదే నిజం అని చెప్పేవాడు. ఆయనకు అబద్ధం చెప్పవలసిన అవసరం ఏమిటి? స్వార్థం ఉన్న మనిషికి అబద్ధం చెప్పవలసిన అవసరం ఉంది. జ్ఞానికి కాని, దేవుడికి కాని అబద్ధం చెప్పవలసిన పని లేదు. నువ్వు ఈ దేహానివి అయితే నిజంగా ఈ దేహానివి అని చెప్పేవాడు. నిజంగా నువ్వు మనసువి అయితే నువ్వు మనసు అని చెప్పేవాడు. ఇవన్నీ నువ్వు కాదు కాబట్టి నువ్వు ఆత్మవి కాబట్టి నువ్వు ఆత్మ అని చెబుతున్నాడు కాని, నువ్వు అనుకునేదే కనుక నిజం అయితే ఇదే నిజం అని దేవుడు చెప్పి ఉండేవాడు. దేవుడికి అబద్ధం చెప్పవలసిన పని లేదు.

అందరూ మోక్షంలోనే ఉన్నాము కానీ వేంపాడులో ఉన్నాము అని అనుకుంటున్నాము. కారణం దేహం వేంపాడులో ఉంది కాబట్టి వేంపాడులో ఉన్నాము అనుకుంటున్నారు. కొంతమంది ఏమి అనుకుంటున్నారు అంటే గుడి కట్టించి సత్రం కట్టించి మోక్షం కొట్టేద్దాం



**జీవుడు ఏ దేహంలో ఉన్నా, ప్రతి జీవుడి యొక్క గమ్యం ఏమిటంటే వాడి హృదయంలో ఉన్న సద్వస్తువుతో తాదాత్మ్యం పొందటమే. అప్పటివరకు జీవుడి యొక్క యాత్రకు ముగింపు లేదు.**

అని చూస్తున్నారు. నువ్వు సంపాదించటం వల్ల వచ్చేది కాదు మోక్షం. నువ్వు మోక్షంలోనే ఉన్నావు. మోక్షం నీ స్వరూపం. నువ్వు మోక్షంలో ఉన్నావు అన్న సంగతి నీకు తెలియటం లేదు. ఇది సంపాదించే వస్తువు కాదు. నిజంగా ఇది సంపాదించే వస్తువు అయితే మోక్షం కూడా తప్పనిసరిగా పోతుంది. ఒక ముసలమ్మ గారు భగవాన్‌ని ఏమని అడిగారు అంటే మూడు గంటలకు నాకు ట్రైన్ ఉంది స్వామి, మీరు నాకు మోక్షం ఇచ్చేయండి. మోక్షం ఇచ్చేస్తే నేను వెళ్ళిపోతా అంటే భగవాన్ ఏమి అన్నారు అంటే మోక్షం అంటే మూట అనుకుంటున్నావా? నెత్తి మీద పెట్టుకుని పోవటానికి అన్నారు. మీ స్వరూపమే మోక్షం. ఇప్పుడు మనం మోక్షంలోనే ఉన్నాము. అయితే దేహబుద్ధి కారణంగా ఈ మనోగతమైన నేను కారణంగా, నేను మోక్షంలోనే ఉన్నాను అన్న సంగతి నాకు తెలియటం లేదు. రాముడు దేవుడు అని అంటున్నాము. రాముడు దేవుడు అంటే రాముడి శరీరం దేవుడు కాదు. రాముడిలో ఉన్న ఆత్మ దేవుడు. రాముడిలో ఏ ఆత్మ అయితే ఉందో అది నీ హృదయంలో కూడా ఉంది. కృష్ణుడిలో ఏ ఆత్మ అయితే ఉందో ఆ ఆత్మ నీ హృదయంలో ఉంది. రాముడి యొక్క దేహం దేవుడు కాదు. అయితే తన హృదయంలో ఉన్న ఆత్మ తనకి తెలుసు. అందుచేత ఆయనను దేవుడు అన్నారు. అలాగే కృష్ణుడి హృదయంలో ఉన్న ఆత్మ కృష్ణుడికి తెలుసు. అందుచేత దేవుడు అన్నారు. అదే విధంగా నువ్వు కూడా దేవుడివి అయిపోతావు. ఎప్పుడు? నీ హృదయంలో ఉన్న ఆత్మ నీకు తెలిస్తే నువ్వు కూడా దేవుడివి అయిపోతావు. అపుడు ఇంక నీకు దుఃఖం లేదు.

దుఃఖపడేవాళ్ళు అందరూ పాపాత్ములు అని, సుఖపడేవాళ్ళు అందరూ పుణ్యాత్ములు అని, అందరూ అనుకుంటారు. ఏవండీ మనకి ఇక్కడ పుణ్యాత్ములు ఎక్కువ ఉన్నారా? పాపాత్ములు ఎక్కువ ఉన్నారా? కాని ఎవరైతే కష్ట పడుతున్నారో, ఎవరైతే నష్ట పడుతున్నారో, ఎవరైతే మంచికోసం దుఃఖ పడుతున్నారో, వాళ్ళ పాపాలు అన్నీ కరిగిపోతాయి. వాళ్ళు దుఃఖపడుతున్నట్టుగా మనకి అనిపించవచ్చు. కానీ వాళ్ళ పాపం ఖర్చు అయిపోతుంది. కొంతమంది బంగారు పిచ్చుకలు లాగా చాలా బాగుంది, మాకు చాలా బాగా వెళ్ళిపోతున్నాయి రోజులు అని అనుకోవచ్చు. అయితే వాళ్లకి పుణ్యం ఖర్చు అయిపోతుంది. పాపం ఖర్చు అవ్వటం మంచిదా? పుణ్యం ఖర్చు అవ్వటం మంచిదా? నా హృదయంలో సమతుల్యత రాకుండా నా బలహీనతలే అడ్డు వస్తున్నాయి. సమత్వదృష్టి రాకుండా సమంగా ఉన్న ఆత్మ తెలియదు. భేదబుద్ధి ఉన్న మనసుకి ఆత్మ తెలియదు. కలుషితమైన బుద్ధికి ఆత్మ తెలియదు. మీరు చేసే ప్రయత్నం వల్ల మీ బుద్ధి శుద్ధి అవ్వాలి. మీ బుద్ధి శుద్ధి అవ్వకుండా జ్ఞానం ఎవరికీ రాదు. బుద్ధి నిర్మలం అవ్వాలి.

సోదరమహాశయులారా! మీరు పాపంతోటి పోరాడాలి అంటే మీరు నిజంగా పాపం నుండి బయట పడాలి అంటే ఎంతో కొంత మీ హృదయంలోని శాంతి మీకు అందాలి. అప్పుడు మీలో ఉన్న పాపం పోతుంది. ఈ దేహం పుట్టింది, ఈ దేహం చనిపోతుంది. ఈ శవం విడిచిపెట్టగానే ఇంకొక శవం వస్తుంది. దీనినే పునర్జన్మ అంటారు అంటే నువ్వేమీ మారవు. దేహం మారుతుంది, ఇంకొక కొత్త దేహం వస్తుంది. శరీరం పడిపోయిన తరువాత ఏదో సాధిద్దాం అని కొంతమంది అనుకొంటారు. శరీరం పడిపోయిన తరువాత సాధించేది ఏమీ లేదు. మళ్ళీ నీకు కొత్త దేహం రావాల్సిందే, అందుచేత మీరు ఏదైనాసాధించాలి అనుకుంటే దేహం ఉండగానే సాధించాలి. నేను చనిపోతాను అనుకోండి, చనిపోతే వేంపాడు ఎక్కడ ఉంది? ఇలా చూసుకుంటూ ఉంటాను. కొన్నిరోజులు వేంపాడు జ్ఞాపకం వస్తుంది. వేంపాడు ఎక్కడ ఉంది అని ఎందుకు చూసుకుంటారు అంటే డబ్బై ఏళ్ళు వేంపాడులో ఉన్నాను కదా, శరీరాన్ని అంటే కాల్చేశారు కాని మనసు కాలలేదు కదండీ. అందుచేత వేంపాడు ఏమైంది, వేంపాడు ఏమైంది, దక్షిణ పొలం ఎలా ఉంది, ఉత్తర పొలం ఎలా ఉంది, పడమర పొలం ఎలా ఉంది, ఇవన్నీ గుర్తుకు వస్తూ ఉంటాయి. ఇదంతా మీరు మరణించాక తెలుస్తుంది నేను చెప్పేది నిజమో, అబద్ధమో. అయితే రమణస్వామి ఏమన్నారంటే రాత్రులు మీకు వచ్చే కల పొట్టిది, ఈ కల పొడుగుది అన్నారు. రాత్రుళ్లు మనకి అందరికి కలలు వస్తాయి, అది పొట్టి కల, ఇది పొడుగు కల. కానీ అదీ అబద్ధమే, ఇదీ అబద్ధమే అన్నారు. ఏవండీ అలా అంటున్నారు. ఇప్పుడు ఇదంతా అబద్ధం అంటే మీరు ఎవరైనా ఒప్పుకుంటారా? ఏవండీ కల వచ్చినంతసేపు, ఆ కలలో ఉన్నంత సేపు మీకు అది నిజం అనిపిస్తుందా? అబద్ధం అనిపిస్తుందా? నిజమే అనిపిస్తుంది. ఎప్పుడు అబద్ధం అనిపిస్తుంది? మీకు మెలకువ వచ్చాక ఓహో ఇదంతా అబద్ధం అనిపిస్తుంది. మీకు ఎవరికైనా నేను పది రూపాయలు అప్పు ఇచ్చినట్టు నాకు కల వచ్చింది అనుకోండి పొద్దున్న వచ్చి నా పది రూపాయలు నాకు ఇచ్చేయమంటే ఇస్తారా మీరు? అదే విధంగా ఇది కూడా కలే, అయితే ఇది కల అని మనకి తెలియదు. ఎప్పుడు తెలుస్తుంది? నీలో ఉన్న ఆత్మని తెలుసుకున్నాక ఇది కూడా కలే అని తెలుస్తుంది.

రమణ స్వామి ఏమి చెబుతున్నాడు అంటే ఓ పుల్లయ్యా నువ్వు మరణించావు అనుకో అది కల, నువ్వు జన్మించావు అనుకో అది కల, ఇక్కడకూర్చొన్నావు అనుకో అదీ కలే, ఇవన్నీ స్వప్నంలో జరుగుతున్నాయి అని చెప్పారు. ఇదంతా కల అనుకో, కలలు ఎప్పుడు వస్తాయి? పగలు వస్తాయా, నిద్రట్లో వస్తాయా మనకు కలలు? ఇదంతా కల అన్నప్పుడు మనం నిద్రపోతున్నాం అని అర్థం, ఇప్పుడు మనందరం మెలకువగా ఉన్నామా? నిద్రపోతున్నామా?

రమణ స్వామి చెప్పేది ఏమిటంటే నిద్రట్లోనే ఉన్నాము అని, ఏమిటి నిద్ర అజ్ఞానం అనే నిద్రలో ఉన్నాము. ఈ అజ్ఞానం అనే నిద్ర నుండి బయటకి వచ్చినప్పుడు తెలుస్తుంది ఇది అంతా కల అని, ఆత్మ తెలిస్తే నీకు ఈ స్థూల, సూక్ష్మ శరీరాల బెడద ఉండదు. నీకు ఈ ప్రకృతి బెడద, ఈ సంసారం బెడద, ఈ అజ్ఞానం బెడద, ఈ పునర్జన్మ బెడద, ఈ కష్టాల బెడద, ఈ నష్టాల బెడద, ఈ అనారోగ్యాల బెడద, ఈ శారీరకమైన, మానసికమైన రుగ్మతల బెడద, ఈ దుఃఖం యొక్క బెడద, ఈ నష్టం యొక్క బెడద, ఈ బెడదలు అన్నీ ఆత్మను తెలుసుకునే వరకు నీకు తప్పవు. ఆత్మను ఏ సెకనులో అయితే నువ్వు తెలుసుకున్నావో ఆ బెడదలు అన్నీ విడిచిపెట్టి పారిపోతాయి. ఒక కష్టం పోతే ఇంకో కష్టం, ఒక నష్టం పోతే ఇంకో నష్టం, ఒక బాధ పోతే ఇంకో బాధ, ఒక లోకం పోతే ఇంకొక లోకం, ఒక శవం పోతే ఇంకొక శవం, ఒకటి తరువాత ఇంకొకటి వచ్చి నిన్ను పీడిస్తాయి. ఎప్పటి వరకు? నువ్వు ఆత్మను తెలుసుకునే వరకు, అప్పటివరకు నీకు ఈ బంధం తప్పదు, ఈ బెడద తప్పదు.

సోదరమహాశయులారా! రమణ భగవాన్ చెప్పిన మాటల్లో, ఒక్క మాటలో అస్పష్టత ఉంటే చెప్పండి. ప్రతీ మాటలోను స్పష్టత ఉంది. ఇది కేష్ బేరమే, అరువు బేరం మటుకు కాదు. మోక్షం పొందడం కోసం ఈ శరీరం పడిపోయే వరకు ఆగక్కర్లేదు. మోక్షం ఇప్పడే ఉంది, ఇక్కడే ఉంది. ఇప్పడు మోక్షం లేకపోతే తరువాత ఎప్పడో వస్తుంది అంటే అది నిజం కాదు. నిజం అనేది ఎప్పడూ ఉంటుంది. ఆత్మ ఎప్పడూ నిజమే. ఈ శరీరం ఇప్పడు ఉంది, ఈ వేంపాడులో మనం అందరం కూర్చొన్నాం, ఇంకో యాభై సంవత్సరాలు అయిన తరువాత చూస్తే ఇందులో ఒక్కడు కనిపిస్తాడా? లేదు. దేహాన్ని విడిచిపెట్టడం ఎవరికీ ఇష్టం లేదు, ఇందులో ఎవరికి అయినా ఇష్టం ఉందా మీ దేహాన్ని విడిచిపెట్టడం? అవసరం అయితే రాయవెల్లూరు వెళ్ళిపోతాం వైద్యం చేయించుకోవడానికి. దేహాన్ని విడిచిపెట్టడం ఎవరికీ ఇష్టం లేదు. కాని అందరి దేహాలు అందరిని విడిచిపెట్టేస్తున్నాయి. ఎందుచేత అది నిజం కాదు. నా దేహమే నిజం అయితే నన్ను విడిచిపెట్టడానికి వీలు లేదు. నా మనస్సే నిజం అయితే నా భావాలు మారటానికి వీలు లేదు. ఇవాళ ఉన్న ఆలోచన రేపు లేదు. నా మనసులో ఆలోచనలు మారుతున్నాయి. తలంపులు మారుతున్నాయి. ఊహలు మారుతున్నాయి. ఆదర్శాలు మారుతున్నాయి, ఆశయాలు మారుతున్నాయి. ఆకాంక్షలు మారుతున్నాయి. ఇదే కనుక నిజం అయితే మారుతుందా? అందుచేత ఈ బెడద తప్పదు. ఈ అజ్ఞానం అనే బెడద తప్పదు. శరీరం అనే బెడద తప్పదు. ఈ రోగం యొక్క బెడద తప్పదు. నీ మనసులో ఉన్నటువంటి ఆందోళనలు, చిరాకులు, స్పర్ధలు, ద్వేషాలు, కక్షలు ఇవి తప్పవు. ఎప్పటి వరకు? పరమ పవిత్రం అయినటువంటి, ఉదాత్తమైనటువంటి, ఉన్నత

మైనటువంటి ఆ సద్వస్తువు నీకు అనుభవం లోకి వచ్చేవరకూ నీకు ఈ బెడదలు, నష్టాలు, కష్టాలు తప్పవు.

నిజం శాశ్వతంగా ఉంటుంది. అబద్ధం శాశ్వతంగా ఉండదు. మీరు అనుభవించే శాంతే కనుక నిజం అయితే అది ఎప్పుడూ ఉండాలి. మరి శాంతి ఎందుకు చెరిగిపోతోంది? మీకున్న శాంతి నిజం అయితే శాశ్వతంగా ఎందుకు ఉండటం లేదు? అయితే మీకు అప్పుడప్పుడు శాంతి వస్తుంది అది అహంకారం యొక్క కల్పితమే, అది నిజమైన శాంతి కాదు. మీకు అప్పుడప్పుడు సుఖం వస్తుంది అది అహంకారం యొక్క కల్పితమే. అది నిజమైనది కాదు, ఏది నిజమైన శాంతి? ఏది నిజమైన సుఖం? ఏది నిజమైన స్వరూపం? ఆత్మ. ఓసోదరమహాశయులారా!, సోదరమహాశయులారా! ఈ బెడదలు తప్పవు మీకు, ఈ difficulties తప్పవు. ఎప్పటి వరకు? మీరు ఆత్మ తెలుసుకునే వరకు ఈ domestic troubles కాని, domestic difficulties కాని, domestic disappointments కాని, ఏది తప్పవు. ఎప్పటి వరకు అంటే మీరు నిజం తెలుసుకునే వరకు. మీరు నిజం తెలుసుకోకపోతే దేవుడికి ఏమి నష్టం లేదు. మీ సుఖం కోసం, మీ స్వాతంత్ర్యం కోసం, మీ శక్తి కోసం, మీ శాంతి కోసం మీరు దేవుడిని తెలుసుకోవాలి కాని, మీరు తెలుసుకోకపోతే దేవుడికి వచ్చే నష్టం ఏమీ లేదు. ఈ మధ్యన ఒక అమ్మగారు ఏమి చెప్పారు అంటే నేను మోక్షం కోసం ప్రయత్నం చేస్తున్నాను, నాకు మోక్షమే కావాలి. నాకు తిరిగి పుట్టాలి అని లేదు అని చెపుతోంది. ఇదేవిషయం ఒకసారి ఆవిడ వాళ్ళ ఆయనతో చెప్పిందట. వాళ్ళ ఆయన ఏమి అన్నారు అంటే మరి తిరిగి నువ్వు పుట్టకపోతే ఎలాగా? నాకు పుట్టాలి అని ఉంది. మళ్ళీ జన్మలో కూడా నువ్వు నాకు భార్యవి అయ్యి పుట్టాలి, అని మా ఆయన ఇలా అంటున్నారు అని చెప్పింది పాపం. ఇది కథ కాదు, ఇది నిజమే. అప్పుడు నేను అన్నాను ఇంత certificate ఎవరు పొందుతారు? నిజంగా మీ ఆయన మళ్ళీ జన్మలో కూడా మిమ్మల్నే భార్యగా ఉండాలి అని కోరుకుంటున్నాడు అంటే మీరు ఎంత గొప్ప వ్యక్తి అయి ఉండాలి అన్నాను. మళ్ళీ జన్మలో కూడా ఆవిడే భార్యగా ఉండాలి అంటున్నాడు అంటే ఈవిడ వల్ల ఆయన ఎంత సుఖ పడ్డారో మరి.

ఆత్మ నీకు తెలిస్తే నీకు ఈ స్థూల భేదం లేదు. స్థూల దేహం, సూక్ష్మ దేహం వీటి బెడద ఉండదు. పరిమితులు ఉండవు. నువ్వు దేహానివి అనుకుంటున్నావు కాబట్టి నువ్వు పరిమితం అయిపోయావు. దేహం నుంచుంటే నుంచున్నాను అని, కూర్చుంటే కూర్చున్నాను అని, నడుస్తుంటే నడుస్తున్నాను అని, రోగం వస్తే నాకు రోగం వచ్చింది అని అనుకొంటున్నావు, నువ్వు దేహానివి అనుకుంటున్నావు కాబట్టి ఇలా పరిమితం అయిపోయావు. కొంతమంది ఏమంటారు మేము రాజులం అంటారు. దేహం రాజులా? లేకపోతే మీరు రాజులా?

కొంతమంది మేము బ్రాహ్మణులం అంటారు. అంటే దేహం బ్రాహ్మణులా? మీరు బ్రాహ్మణులా? లేకపోతే కొంతమంది కాపులు అంటారు. అంటే దేహం కాపా? లేకపోతే మీరు కాపులా? రమణమహర్షి నువ్వు ఎవరో తెలుసుకో అంటే నువ్వు ఎవరి అబ్బాయి అని కాదు నువ్వు ఎవరి అమ్మాయి అని కాదు నువ్వు నేను నేను అంటున్నావు. ఆ నేను ఎవడో నువ్వు చెప్పమని. రమణమహర్షి అడిగేది నీ కులం కాదు, నీ జాతి కాదు, నీ మతం కాదు, నీ దేశం కాదు, నీ లింగం కాదు. ప్రతీ మనిషి నేను నేను అంటున్నాడు. ఆ నేను ఎవరో తెలుసుకో, అంతేగాని మీరు బ్రాహ్మణులా, రాజులా, కాపులా అని కాదు. నువ్వు నేను నేను అంటున్నావు. అ నేను ఎవరో నీకు తెలుసా? ఆ నేను ఎవరో నీకు తెలియకపోతే దేవుడు ఎవరో నీకు తెలియదు. ఎందుచేత? ఈ నేనుకి సోర్స్, ఈ సృష్టికి సోర్స్, దేవుడు మాత్రమే. ఆ నేను గురించి నీకు తెలియకపోతే దేవుడు గురించి నీకు తెలియదు. ఒకవేళ తెలుసుకున్నాను అని నువ్వు అనుకుంటే అది అబద్ధం. దేనికైతే పరిమితి లేదో అది ఆత్మ, దేనికైతే పరిమితి ఉందో, అది అహంకారం. అందుచేత నువ్వు పరిమితులు చేధించుకుని వెళ్ళు, అపరిమితమైన ఆత్మ నీకు అందుతుంది అంటున్నారు రమణస్వామి.

**సత్యజ్ఞానము లేని యీ జన్మఫలమేమి యొప్పగ రావేల యరుణాచలా**

ఓ అరుణాచలా! నేను సత్యాన్ని తెలుసుకోకుండా, జ్ఞానాన్ని తెలుసుకోకుండా, నా ముక్కులో ఉన్న గాలి బయటకి పోతే ఇంక ఈ జన్మ యొక్క ప్రయోజనం ఏమిటి? రమణ స్వామి చెప్పింది ఏమిటి అంటే ఈ ముక్కులో ఉన్న గాలి బయటకు పోక ముందే నువ్వు ఎవరివో నువ్వు తెలుసుకో, నువ్వు ఎవరివోనీకు తెలియకపోతే నువ్వు ఎన్ని సాధించినప్పటికీ అది కల తోటి సమానం. ఏది సాధించినప్పటికీ అది స్వప్నంతోటి సమానం. నువ్వు ఎవడో నీకు తెలియకపోతే అది ఒకటి లేని సున్నా. The greatest achievement, noblest achievement. నువ్వు ఎవరివో నువ్వు తెలుసుకోవడమే. నువ్వు ఎవడో నువ్వు తెలుసుకోకుండా నేను జీవితంలో ఏదో సాధించాను అంటే సాధించవచ్చు అది స్వప్నం మాత్రమే, అది నిజం కాదు. మన మనసు కూడా కోతి లాంటిది, కోతి ఏమి చేస్తుంది ఒక రొబ్బ మీద నుంచి ఇంకో రొబ్బ మీదకి ఉరుకుతూ ఉంటుంది. నా మనసు కూడా ఏమి చేస్తుంది ఒక తలంపుని పట్టుకుంటుంది తరువాత ఇంకో తలంపు మీద ఉరుకుతుంది, ఆ తలంపుని పట్టుకుంటుంది. కోతి లాగ అలా ఉరుకుతూ ఉంటుంది, అందుచేత శంకరాచార్యుల వారు కాశీ వెళ్లి ఏమని చెప్పారు అంటే, ఓ విశ్వనాథస్వామీ నువ్వు నాకు ఏమి ఇవ్వవద్దు. మోక్షం ఇవ్వద్దు, నిన్ను ఏమీ అడగటం లేదు కాని నా దగ్గర ఉన్నది ఒకటి నువ్వు పుచ్చేసుకో, నువ్వు పుచ్చేసుకుంటే నాకు లాభం, నీకు లాభం అన్నారు. ఏమిటంటే ఎవడైనా కోతిని పెట్టుకుని అడుక్కోవడానికి

వచ్చాడు అనుకోండి ఇంకో దోసెడుబియ్యం ఎక్కువ వేస్తాం. నా మనస్సు అనే కోతిని నువ్వు పుచ్చేసుకో, పుచ్చేసుకుంటే నాకు ఈ మనసు పీడ వదిలిపోతుంది. ఈ అజ్ఞానం పీడ వదిలిపోతుంది. ఈ అహంకారం పీడ వదిలిపోతుంది. అలా నాకు లాభం. అయితే నీకు లాభం ఏమిటంటే నా మనసు అనే కోతిని నువ్వు కూడా తీసుకుని అడుక్కోవడానికి వెళ్లవచ్చు నీకు ఎక్కువ బియ్యం దొరుకుతాయి. ఈ మధ్యన ఒక పెద్ద మనిషి తోటి చెప్పాను ఏవండీ మీ ఊర్లో ఉన్న సత్పురుషుల తోటి సహవాసం చేస్తూ ఉండండి లాభం పొందుతారు అని, మా ఊర్లో సత్పురుషులు ఎవరు ఉన్నారు , కొబ్బరి చెట్లు, తాటి చెట్లే పెద్ద మనుషులు అన్నాడు. నేను ఒక అందుకు చెబుతుంటే ఆయన ఇంకో లాగ ఆయన చెబుతున్నాడు, ఆయనకి ఏమి బాధ ఉందో నాకు ఏమి తెలుసు? అంటే భగవంతుడు ఏమైనా చెబుతున్నప్పటికీ మన మనసులో ఉన్నది అందులో కనిపిస్తూ ఉంటుంది. భగవద్గీతలో కృష్ణుడు ఏమి చెప్పాడో అది కనపడదు భగవద్గీత చదివేటప్పుడు మన మనసులో ఉన్నది భగవద్గీతలో కనిపిస్తుంది. భగవద్గీత అందరికి నోటికి వచ్చేసిందా , చదవటం మానకండి, చదవండి, చదివితే పుణ్యం వస్తుంది. చదివింది మీకు అర్థం అయ్యి ఆచరిస్తే మోక్షం వస్తుంది.

జ్ఞానమే నిజమైన ఐశ్వర్యం. ఆ ఐశ్వర్యం నువ్వు సంపాదించకుండా శరీరం విడిచి పెట్టేస్తావు అనుకో ఈ శరీరం ఎందుకు వచ్చినట్టు? వంద బస్తాల బియ్యం అన్నం తినడానికా? పుట్టటం నువ్వే కాదు చెట్లు కూడా పుడుతున్నాయి. నువ్వే పెరగటం లేదు చెట్లు కూడా పెరుగుతున్నాయి. నువ్వే చనిపోవట్లేదు చెట్లు కూడా చనిపోతున్నాయి. అయితే మనిషి జన్మ ఎత్తినందుకు నువ్వు సాధించింది ఏమిటి? నీకు భగవంతుడు బుద్ధి ఇచ్చినందుకు సాధించింది ఏమిటి? అందుచేత భగవంతుడు నీకు బుద్ధి ఇచ్చినందుకు ఆ జ్ఞానాన్ని సంపాదించు. జ్ఞానాన్ని సంపాదించకుండా కనుక నువ్వు శరీరం విడిచిపెడితే విపరీతమైన నష్టాన్ని పొందుతావు. నీకు మానవజన్మ వచ్చినందుకు ఈ అవకాశాన్ని ఉపయోగించుకో. నువ్వు జ్ఞానాన్ని సంపాదించు, నువ్వు మోక్షాన్ని పొందు. మేము ఈ మధ్యన చాలా మంచి

**మీలో ఎవరికైనా క్రూరత్వం ఉంటే తగ్గించుకుని దయాస్వభావమును పెంచుకోండి. దయగల హృదయంలోనే దేవుడు సాక్షాత్కరింపబడతాడు. దయగల హృదయమే భగవంతుని నిలయం.**



పనులు చేస్తున్నాము అంటారు. రైటే మీరు చేసిన మంచి పనుల వల్ల మీ మనసు ఏమైనా బాగుపడిందా? చాలా చేసేశాం ఈ మధ్యన అది చేసేశాం, ఇది చేసేశాం, లేకపోతే ఇంకోటి చేసేశాం, ఇంకోటి చేసేశాం అని దండకం చదువుతూ ఉంటారు. దండకం అంటే దేవుడిని పొగడటమే. మనం అజాగ్రత్తగా ఉంటాం కాని దేవుడు మటుకు అజాగ్రత్తగా ఉండడు, మనల్ని ఎవరైనా పొగిడారు అనుకోండి పడిపోతాం, పది రూపాయలు ఇచ్చేది వంద రూపాయలు ఇస్తాము. పొగుడుతుంటే ఉబ్బి పోతున్నాం అంటే మన అజాగ్రత్తే కారణం. మనం అజాగ్రత్తగా ఉంటున్నాము. మన అజాగ్రత్త వల్లే మనం పొంగిపోతున్నాం. దేవుడు ఎప్పుడు అజాగ్రత్తగా ఉండడు. దేవుడు జాగ్రత్తగా ఉంటాడు. అందుచేత మీరు రోజు పొద్దున్నే లేచి ఎన్ని దండకాలు చదివినా మీరు ఎందుకు దండకాలు చదువుతున్నారో, మీ మనసులో ఏముందో, మీ తలంపులో ఏముందో, అది చూస్తూనే ఉంటాడు. మీ పొగడ్తలకి లొంగిపోయి మీకు మోక్షాన్ని ఇవ్వడు. మీరు అజాగ్రత్తగా ఉండవచ్చు కాని దేవుడు మటుకు అజాగ్రత్తగా ఉండడు. దేవుడు ఎప్పుడూ జాగ్రత్తగానే ఉంటాడు. నీ దండకాలకి మోసపోడు. నీ గుంజీలకి మోసపోడు. నీ దండాలకి మోసపోడు. వాటిని చూసి మోసపోవటానికి దేవుడు అమాయకుడు కాదు. అయితే ఆయన మీ sincerityని చూస్తాడు. మీ నిజాయితీని చూస్తాడు. మీ హృదయాన్ని పరిశీలిస్తాడు. మీ మనసు ఎంతవరకు పక్వానికి వచ్చింది? మీ హృదయం ఎంతవరకు విశాలం అయ్యింది. మీకు ఎంత ఇంద్రియ నిగ్రహం ఉంది. ఎంత మీ మనసు నిగ్రహంలో ఉంది. మీరు ఎంత సరళమైన జీవితం జీవిస్తున్నారు. ఎంత ఉదాత్తంగా జీవిస్తున్నారు. మీ మనసు ఎంత ఆరోగ్యంగా ఉంది మీ మనసులో ఎంత సౌందర్యం ఉంది. మీ మనసు నిజంగా నిర్మలంగా ఉందా లేదా అది చూస్తాడు కాని మీరు బాహ్యంగా చేసే పూజలు కాని, జపాలు కాని, మీ నమస్కారాలు కాని దేవుడు చూడనే చూడడు. దేవుడిని మోసం చేయడానికి ఎవరు ప్రయత్నం చేయవద్దు. అజాగ్రత్త అనే సమస్య లేదు దేవుడికి 24 గంటలూ జాగ్రత్తగానే ఉంటాడు. దేవుడు అజాగ్రత్తగా ఉంటాడు అనుకొని ఆయనను మీరు మోసం చేయటానికి చూడకండి. దేవుడు అజాగ్రత్తగా ఉండే సమస్య ఉండదు.

సోదరమహాశయులారా! మీరు ఏది మాట్లాడినా, ఏ పని చేసినా వాటిని బాహ్యంగా చూడడు. మీరు పని చేసేటపుడు మీ దృష్టి ఏమిటి? మీరు మాట మాట్లాడేటప్పుడు మీ దృష్టి ఏమిటి? అది చూస్తాడు. మీ దృష్టిని చూసి మీకు మోక్షాన్ని ఇస్తాడు. చాలామంది అంటున్నారు ఈ మధ్యన మేము చాలా మంచి పనులు చేస్తున్నాము అని, మీరు నిజంగా చేసేది మంచి పని అయితే మీ మనసు బాగుపడిందా? మీరు వాడే మందు కనుక మీ రోగానికి పని చేసే మందు అయితే మీ రోగం తగ్గాలి కదా, అదే విధంగా మీరు చేసే

పనులు కనుక నిజంగా మంచి పనులు అయితే మీ మనసు బాగుపడిందా? మీ మనసు సంస్కరించబడిందా? మీరు చేసే పనులు కనుక మంచి పనులు అయితే మీ మనసు ఎందుకు బాగుపడలేడు. మీ పారాయణ నిజం అయితే , మీ ధ్యానాలు నిజం అయితే, మీ జపాలు నిజం అయితే మీ మనసు ఎందుకు బాగుపడటం లేదు? మీరు చేయండి నేను వద్దు అనటం లేదు. ఇవన్నీ మీ మనసు బాగుపడటం కోసమే. మీరు చేసేదే కనుక నిజం అయితే మీ మనసులోకి ఎందుకు సౌందర్యం రావటం లేదు? మీ మనసు ఎందుకు బాగుపడటం లేదు? పరమేశ్వరుడి ప్రీతి కోసం కాకుండా మీ గౌరవాల కోసమే మంచి పనులు చేస్తే మీరు పరలోకానికి వెళ్లిన తరువాత మేము చాలా గౌరవం పొందాం, భూలోకంలో మాకు చాలా గౌరవం ఉంది అంటే, పరమేశ్వరుడు ఏమి అంటాడు అంటే మీరు ఎవరో నాకు తెలియదు, బయటకు వెళ్లండి అని బయటకు తోలేస్తాడు. గౌరవం కేవలం ఈ భూమికి సంబంధించినది. ఈ లోకానికి సంబంధించినది.

నువ్వు ఆత్మ అయితే నీకు దుఃఖం ఎందుకు వస్తోంది? ఈ దుఃఖ పడేవాడు ఎవడు? వాడే అహంకారి. మనకి ఏదైనా నష్టం వచ్చింది అనుకోండి మనం ఏడుస్తాం. మన బంధువులు ఎవరైనా పోయారు అనుకోండి మనం ఏడుస్తాం. మన లోపల ఉండి ఏడ్చేవాడు ఎవడు? మనకి ఆరోగ్యం పాడు అయిపోయింది అనుకోండి మనం ఏడుస్తాం. ఆ లోపల ఉండి ఏడ్చేవాడు ఎవడు? అది ఆత్మా? అహంకారమా? అహంకారం ఏడుస్తుంది అయితే నువ్వు ఆత్మ అని చెప్పాడా భగవంతుడు అహంకారం అని చెప్పాడా? ఆ ఏడ్చేది నువ్వు కాదు నువ్వు ఆత్మవి. మీ అందరికి తెలిసినా, మీకు తెలియకపోయినా మీరు అందరూ మోక్షంలోనే ఉన్నారు. అయితే మనం చేయవలసిన పని ఒక్కటే. మనం మోక్షంలోనే ఉన్నాము అన్న సంగతి మనకి తెలియాలి. అదే ఇప్పుడు మన సాధన యొక్క లక్ష్యం, మన సాధన యొక్క గమ్యం. నేను ఫలానా సుబ్బమ్మని, ఫలానా ఎల్లమ్మని అని నువ్వు అనుకుంటున్నావు. అందుచేత మళ్ళీ జన్మ నాకు ఏ జన్మ వస్తుంది అని అడుగుతున్నావు కాని నువ్వు ఆత్మ అని తెలిస్తే నీకు పునర్జన్మ గొడవ ఏముంది? భగవాన్ దగ్గరకు వెళ్లి మా పూర్వజన్మ ఏమిటి అని కొంతమంది అడిగేవారు. మీ పూర్వ జన్మ ఏమిటో మీరు చెప్పమంటే చెబుతాను. కాని ఈ జన్మ కష్టాలే మీరు భరించలేక పోతున్నారు. పూర్వజన్మ సంసారాల గొడవ మీరు మోయగలరా? ఈ జన్మలో గొడవలే భరించలేక పోతున్నారు. పూర్వజన్మలో గొడవలు కూడా మీకు నేను చెబుతాను అనుకోండి ఈ కష్టాలకి తోడు, ఆ కష్టాలు కూడా ఎందుకు అన్నారట ఆయన. పరమేశ్వరుడు దయ కలవాడు కాబట్టే మీకు ఆ మరుపును పెట్టాడు.

రమణమహర్షి గారి దగ్గరకు వచ్చి కొంతమంది అడిగేవారు ఏవండీ నాకు మళ్ళీ

జన్మ ఏమిటి అని, మళ్ళీ జన్మ ఏమిటి అని అడుగుతున్నావు నువ్వు అసలు పుట్టావా? ఇపుడు నువ్వు పుడితే మళ్ళీ జన్మ ఏ జన్మ అని అడగవచ్చు. నువ్వు అసలు పుట్టావా? అదేంటండి నేను పుట్టకపోవడం ఏమిటి? ఎవరు పుట్టారు? దేహం పుట్టిన మాట రైటే, దేహానివా నువ్వు, ఆ శవానివా నువ్వు. దేహం పుట్టినప్పడు నువ్వు పుట్టలేదు అందుచేత దేహం మరణించినప్పుడు నువ్వు మరణించవు. అయితే నేను అనే తలంపు ఎప్పడైతే పుట్టిందో అప్పడు నువ్వు పుట్టావు. మరి ఎప్పడు మరణిస్తావు? ఈ నేను అనే తలంపు మరణించినప్పడు నువ్వు మరణిస్తావు. ఈ నేను కొంచెం కూడా లేని చోటే స్వరూపం ఉంది. మనకి ఎంతసేపు అబద్ధం చెబితే ఇష్టం, నిజం చెబితే ఇష్టం ఉండదు. ఎందుచేత మన మనసు అబద్ధం కాబట్టి. ఈ అహంకారం, కనిపించే అనుభవాలు నిజం కాదు. ఉన్నది ఒక్కటే అనుభవం. ఉన్నది ఒక్కటే ఆత్మ. ఏవండీ అందరూ ఇంటికి వెళ్ళిపోతారా? ఈ ఇల్లు మనకి నిజమైన ఇల్లు కాదు. నిజమైన ఇల్లు ఏమిటి? మన ఆత్మ, అక్కడకు వెళ్ళే వరకు ఈ ప్రయాణం తప్పదు. పక్షి చాలా స్పీడ్‌గా ఎగిరిపోతూ ఉంటుంది, ఎంత ఎగిరిపోయినప్పటికీ దాని స్వస్థానానికి వచ్చి చేరుకుంటే కాని, దాని గూటికి చేరితేనే గాని దానికి శాంతి లేదు. ఈ ఇల్లు మనకి నిజమైన ఇల్లు కాదు. నిజమైన ఇల్లు ఏమిటి? మన ఆత్మ. ఆ ఇంటికి చేరుకునే వరకు ఈ ప్రయాణాలు తప్పవు మనకి, ఈ ఆందోళన తప్పదు, ఈ అశాంతి తప్పదు. మనం ఎప్పడైనా చుట్టాల ఇంటికి వెళ్ళి కూర్చొంటాం. కాని మన మనసుకి తెలుసు ఈ ఇల్లు మనది కాదు అని, ఏది మన ఇల్లు? ఆత్మ మన ఇల్లు. ఈలోపు ఎన్ని శవాలలో తిరిగినా, ఎన్ని ఊర్లు తిరిగినా, ఎక్కడకు తిరిగినా, మన ఇంటికి మనం వెళ్ళాల్సిందే. అది మర్చిపోకండి. మన అడ్రసే మనం మర్చిపోయాం మన ఇంటి అడ్రస్సే మనకు తెలియటం లేదు. నువ్వు ఎవరో తెలియ చెప్పటం కోసమే అనేకమంది అవతార పురుషులు , యోగులు, జ్ఞానులు, ఋషులు, ఇలా అనేకమంది ఈ భూమి మీదకి వచ్చారు.

ఉన్నది ఒక్కటే వస్తువు, అది ఆత్మ. దానిని మరచిపోవటం వల్ల ఈ గందరగోళం అంతా నీ బుర్రని పట్టుకుంది. ఈ గౌరవాలు, ఈ అగౌరవాలు, ఈ లాభాలు, ఈ నష్టాలు, ఈ గొప్పలు, ఈ తిప్పలు, ఇవన్నీ ప్రకృతికి సంబంధించిన విషయాలు, ఆత్మకి సంబంధించినవి కాదు. ఉన్నది ఒక్కటే వస్తువు. దానిని మనం మరచిపోయాం. మనం ఎవరో మనకి తెలియటం లేదు. అందుచేత ఇవన్నీ మనలని పట్టుకున్నాయి. మనం గౌరవాన్ని దాటకపోతే, అగౌరవాన్ని దాటకపోతే, లాభాన్ని దాటకపోతే, నష్టాన్ని దాటకపోతే, సత్యం తెలియదు. మన గడపే మనం దాటలేనప్పడు భీమవరం ఎలా వెళతాం? అలాగే నా అజ్ఞానాన్ని నేను దాటలేకపోతే, నా అహంకారాన్ని నేను దాటలేకపోతే నాకు నిజం ఎలా తెలుస్తుంది? నాకు

విడుదల ఎలా వస్తుంది? నేను నా ఇంటికి ఎలా వెళ్ళగలను? నేను మోక్షాన్ని ఎలా పొందగలను? దేవుడు పూర్వం ఉన్నాడు ఇప్పుడు లేడు అని మీరు ఎవరు అనుకోవద్దు. దేవుడిని విడిచిపెట్టి ఈ లోకం లేదు. దేవుడి లోనే ఈ ప్రపంచం ఉంది. ఆత్మలోనే ఈ ప్రపంచం ఉంది. పరమాత్మను విడిచిపెట్టి ఒక్క సెకను కూడా ఈ లోకం ఉండదు. ఐన్ స్టీన్ అనే శాస్త్రవేత్త ఏమని చెప్పాడు అంటే తన దేహపరిమితిలోంచి దేహపరిధిలోంచి ఎవడైతే విడుదల పొందలేడో, వాడికి సత్యం తెలియదు. అది నీ హృదయంలోనే ఉంది, నీకు దగ్గరలోనే ఉంది అయినా కాని నీకు తెలియదు. స్థూలబుద్ధికి ఆత్మ తెలియదు, సూక్ష్మబుద్ధికి ఆత్మ తెలుస్తుంది.

సోదరమహాశయులారా! మీకు వినయం ఉండాలి, పవిత్రత ఉండాలి. ఇవన్నీ ఎందుకు మీ హృదయంలోని ఆత్మని తెలుసుకోవడానికే. అయితే మీరు చేసే పూజలు, యాగాలు, యజ్ఞాలు అన్నీ ఆత్మను తెలుసుకోవడానికే. మీరు రాత్రులు రోజు ఫ్యాన్ వేసుకుంటున్నారా, మంచం ఒకటి, మంచం పైన పరుపు ఒకటి, పైన ఫ్యాన్. ఏవండీ ఇవన్నీ వేసుకుంటున్నారా? ఇవన్నీ పనులు ఎందుకు చేస్తున్నారు మంచం ఎందుకు? పరుపు ఎందుకు? పైన ఫ్యాన్ ఎందుకు? తల కింద దిండు ఎందుకు? నిద్ర కోసం ఇవన్నీ ఎంచుకుంటున్నారు కాని నిద్ర పట్టకపోతే వీటి ప్రయోజనం లేదు. అదే విధంగా మీరు పూజలు చేసినా, జపాలు చేసినా, సహవాసాలు చేసినా, ధ్యానాలు చేసినా మీరు ఆత్మని తెలుసుకోవటానికే, ఇవన్నీచేసినప్పటికీ మీకు ఆత్మ తెలియకపోతే సున్నా, సున్నా, బండి సున్నా. ఈ అజ్ఞానం అనేది పెద్ద బురద. ఈ అజ్ఞానం అనే బురదలోంచి బయటకు రండి. మీకు నచ్చిన గురువును మీరు ఆశ్రయించండి. మీకు నచ్చిన మార్గంలో మీరు ప్రయాణం చేయండి. మీకు నచ్చిన దేవుడిని మీరు పూజించండి. కాని బురద లోంచి బయటకు రండి. మీరు రాముడిని ఆరాధిస్తున్నారా, కృష్ణుడిని ఆరాధిస్తున్నారా అది కాదు. మీకున్న దుఃఖం తగ్గాలి. మీరు సంతోషంగా ఉండాలి. మీరు సుఖంగా ఉండాలి. మీరు శాంతిగా ఉండాలి. అదే నేను కోరుకునేది. అంతే కాని మిమ్మల్ని ఎవరికో ఒకరికి బానిసలుగా తయారు చేయటానికి నేను ఊరూరూ తిరగటం లేదు.



**మనస్సుతో భగవంతుడిని ఎవరూ తెలుసుకోలేరు.**
**కానీ భగవంతుడి మీద మనస్సు పెడితే మనసు**
**కరిగిపోతుంది, జీవలక్షణాలు పోతాయి, దేవుని**
**స్వరూపాన్ని పొందుతారు.**



# శ్రీమద్భగవద్గీత

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)**

**యః సర్వత్రానభిస్నేహః తత్తత్ ప్రాప్య శుభాశుభమ్।**
**నాభినందంతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్టితా ॥2-57॥**

**తాత్పర్యము:** దేనియందును మమతాసక్తులు లేనివాడును, అనుకూల పరిస్థితుల యందు హర్షము, ప్రతికూల పరిస్థితుల యందు ద్వేషము మొదలగు వికారములకు లోనుగాని వాడును అగు పురుషుడు స్థితప్రజ్ఞుడు అనబడును.


యః సర్వత్రాః నభిస్నేహః నువ్వు ఆసక్తి పెట్టుకోకు. వస్తువుల పట్ల కాని, వ్యక్తుల పట్ల కాని, పరిసరాల పట్ల కాని ఇష్టాయిష్టాలు పెట్టుకోవద్దు. జగత్తులో కనిపించే ఏ వస్తువు మీదకాని, వ్యక్తి మీద కాని ఆసక్తి పెట్టుకోకు. పని బంధించదు మనలని ఆసక్తి బంధిస్తుంది. దేనిమీద అభిమానం పెట్టుకోవద్దు. చివరికి నీ శరీరం మీద కూడా అభిమానం పెట్టుకోవద్దు. మన అందరికి మరణం అంటే భయం వేస్తుంది. అంటే నా శరీరం మీద నాకు అభిమానం ఉంది కాబట్టి నాకు మరణం వస్తుంది అంటే భయం వేస్తుంది. ఎవడికైతే శరీరం మీద అభిమానం లేదో, వాడికి మరణం వచ్చినా భయం ఉండదు. సర్వత్రా అంటే ఎదుటి వ్యక్తి మీదే కాదు. ఎదుటి వస్తువుల మీదే కాదు. ఎదుటి పరిసరాల మీదే కాదు, నీ శరీరం మీద, నీ మనస్సు మీద, నీ ప్రాణం మీద కూడా నువ్వు ఆసక్తి పెట్టుకోకు అని అర్థం. నీ శరీరం మీద ఆసక్తి పెట్టుకుంటే నీకు భయం కలుగుతుంది. శరీరం నువ్వు కాదు అందుచేత అభిమానం పెట్టుకోకు అని భగవంతుడు వాసుదేవస్వామి చెబుతున్నాడు.

తత్తత్ ప్రాప్య శుభాశుభం- నీ జీవిత ప్రయాణంలో, జన్మించిన తరువాత మరణించే లోపల నీకు శుభం రావచ్చు, అశుభం రావచ్చు. శుభం అంటే మంచి, అశుభం అంటే చెడ్డ.

మనకి మంచి వచ్చినప్పుడు శుభం అనుకుంటాం. ఆ మంచి జారిపోయినప్పుడు అశుభం అనుకుంటాం.  నీ మనసుని దానిమీద పెట్టుకోకు.  నీ కోరికతోటి, నీ ప్రయత్నం తోటి సంబంధం లేకుండా, నీకు అదృష్టం వస్తుంది, దురదృష్టం వస్తూ ఉంటుంది.  శుభం వెళ్ళిన తరువాత అశుభం, అశుభం తరువాత శుభం. రాత్రి వెళ్ళిన తరువాత పగలు, పగలు తరువాత రాత్రి, ఇలా రాత్రీ పగలు లాగా అవి కూడా తిరుగుతూ ఉంటాయి.  అందుచేత వాటి మీద మనసు పెట్టుకోకు, ఆధ్యాత్మికంగా ఎంత అభివృద్ధి పొందుతున్నాం, ఎంతవరకు ఆత్మాకారం చెందుతున్నాం, ఎంతవరకు లోపలకి దిగగలుగుతున్నాం, ఎంతవరకు భగవంతుడి వైపు ప్రయాణం చేయగలుగుతున్నాం - నీ దృష్టి దానిమీద ఉంచు.  నీ అదృష్టం మీద, నీ దురదృష్టం మీద నీ మనసుని పెట్టకు. ఎందుచేతంటే ఇదీ అబద్ధమే అదీ అబద్ధమే అని చెబుతున్నాడు.

మీకు ఏదైనా అదృష్టం వచ్చింది అనుకోండి అదీ చిరకాలం ఉండదు; దురదృష్టం వచ్చింది అనుకోండి అదీ చిరకాలం ఉండదు.  మీ దేహప్రారబ్ధాన్ని బట్టి మంచి, చెడ్డ వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి.  వాటిమీద నీ మనసు పెట్టుకోకు. అది అంతా స్వప్నం తోటి సమానమే.  కాపవరంలో కారు ఎక్కి పాలకొల్లు వెళుతుంటే, కొంత రోడ్డు బాగుండవచ్చు, కొంత రోడ్డు గోతులతోటి ఉండవచ్చు. కాని మన దృష్టి ఎక్కడ ఉంటుంది?  పాలకొల్లు మీదే ఉంటుంది. అలా మన జీవితప్రయాణంలో కొన్ని రోజులు మనకు బాగుంటాయి, కొన్ని రోజులు బాగుండకపోవచ్చు.  ఆ గొడవలు అన్నీ వదిలేయ్, దేహప్రారబ్ధాన్ని బట్టి అదే వస్తూ ఉంటుంది, అయితే నీ దృష్టిని మటుకు భగవంతుడిని తెలుసుకోవాలి, ఆత్మని సాక్షాత్కరించు కోవాలి, జ్ఞానాన్ని సంపాదించాలి అనే దానిమీదే పెట్టవయ్యా. ఈ అదృష్టాలు, దురదృష్టాలు నిలబడేవి కావు.

నీకు శుభం వచ్చినప్పుడు పొంగిపోయి గంతులు వెయ్యకు, అశుభం వచ్చినప్పుడు క్రుంగిపోయి పడిపోకు. రెండూ వస్తే రానివ్వు. అదృష్టం వచ్చినప్పుడు సంతోషపడకు, దురదృష్టం వచ్చినప్పుడు ద్వేషం పెట్టుకోకు. అలా నువ్వు ఉండగలిగితే అప్పుడు నీ ప్రజ్ఞ, జ్ఞానం స్థిరంగా ఉంటుంది.  అదృష్టం వచ్చిన రోజున ఒకరకంగా ఉండి, దురదృష్టం వచ్చిన రోజున ఒక రకంగా ఉంటే, నీ బుద్ధి స్థిరంగా ఉండదు. అలా రోజుకొక రకంగా నువ్వు అవతారాలు ఎత్తుతూ ఉంటే, నువ్వు నన్ను తెలుసుకోవడానికి ప్రయత్నం చెయ్యలేవు. భగవంతుడు నీ దృష్టిలో ఉండడు. అందుచేత శుభ, అశుభాల మీద నీ మనసుని పెట్టకు అని చెబుతున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి.



# అరుణాచల మహత్త్యం
# అక్షరమణమాల

**దైవమనుచు నిన్ను దరిచేరగా నన్ను**
**పూర్ణనాశ మొనర్చితరుణాచలా ।48।**

**తాత్పర్యము:** నీవేదో దేవుడని, నన్నేదో ఉద్ధరిస్తావనే ఆశతో నీ చెంతకు చేరితే, నీవు నా అహంకారాన్ని పూర్తిగా నాశనము చేసావు అరుణాచలా!

నువ్వు దేవుడవని అందరూ చెప్పకొంటున్నారు. మనం కూడా చూద్దాము అని నీ దగ్గరికి వచ్చాను. తీరా వచ్చిన తరువాత నువ్వు ఏమి చేసావు అంటే, పూర్తిగా వేరుతో సహా నన్ను నాశనం చేసి విడిచిపెట్టావు. దాని అర్థం ఏమిటంటే ప్రతీ జీవుడికీ దేహాభిమానం, దేహబుద్ధి ఉంటుంది. ప్రకృతి గుణాలు, జీవగుణాలు ఉంటాయి. దేవుడవని నిన్ను చూడటానికి నేను ద్వైతబుద్ధి తోటి వచ్చాను. నువ్వు వేరు, నేను వేరు అనే బుద్ధి తోటి నీ సమీపంలోకి వచ్చాను. నువ్వు ఏమి చేసావు అంటే, దేహాభిమానాన్ని నశింపచేసావు. ద్వైత బుద్ధితో నిన్ను సమీపించిన నాకు ద్వైతబుద్ధి తొలగించి, అద్వైతబుద్ధిని కలుగజేసి నాకు అమృతత్వం అనుభవంలోకి వచ్చేలాగ చేసావు.

ఏదైతే నేను నేను అనుకొంటున్నానో, దేనికోసం అయితే నేను జీవిస్తున్నానో , ఆ నేను అనేది నాకు కాకుండా చేసేసి, నాలో ఉన్నటువంటి ఖండత్వాన్ని తీసేసి, నీలో ఉన్నటువంటి అఖండ స్వరూపాన్ని నాకు ప్రసాదించి నన్ను అనుగ్రహించావు అరుణాచలేశ్వరుడా! నన్ను పూర్ణనాశనం చేసావు అంటే అర్థం ఏమిటంటే, నా దేహబుద్ధిని నశింప చేసావు. నాలోని వేరు భావన, నాలోని ద్వైత భావన నాశనం చేశావు అరుణాచలా. నువ్వు వేరు, నేను వేరు, లోకం వేరు అనే బుద్ధి తోటి నేను ఇక్కడకి వచ్చాను. కాని నువ్వు ఆ బుద్ధిని తీసేశావు. ఇక నేను కోరుకోవడానికి ఏముంది ఈ సృష్టిలో? ఈ లోకంలో కాని, పరలోకంలో కాని ఏముంది నేను కోరుకోటానికి?

వేరుభావన ఉన్నంతకాలం కోరికలు కాంక్షలు తప్పవు. వేరుభావన పోయిన తరువాత

తానే అంతటా కనిపిస్తాడు కాబట్టి కోరుకోవడానికి ఒక వస్తువు అంటూ ఏది ఉండదు, తన ఆత్మే అంతటా కనిపిస్తుంది కాబట్టి ఇక వాడికి వాంఛ బయలుదేరదు. విషయం వేరుగా ఉన్నంతకాలం నీకు కోరుకోవాలని బుద్ధి పుడుతుంది. అపుడు కామం వస్తుంది. ఈ వస్తువును సంపాదించాలి, ఆ వస్తువును పొందాలి అని ఆశ కలుగుతుంది. ఈ ఆశకు అంతులేదు.

అలెగ్జాండర్ చక్రవర్తి అనేక రాజ్యాలు సంపాదించిన తరువాత మరణించాడు. చివరికి అతను ఏమని చెప్పాడు అంటే, నన్ను గోతిలో పెట్టినప్పుడు నా చేతులు బయటకి పెట్టి మిగతా శరీరం అంతా గోతిలో పెట్టమన్నాడు. ఎందుకు అంటే, అలెగ్జాండర్ చక్రవర్తి అంతటి వాడు దేశాలని జయించి వట్టి చేతులతోటి పైకి పోయాడు అని తెలియటం కోసం అలా చెయ్యమన్నాడు. కొంతమందికి డబ్బు ఆశ, కొంతమందికి త్యాగమే ధనం. ఎవరైతే త్యాగమే ధనంగా పెట్టుకున్నాడో వాడికి జ్ఞానం కలుగుతుంది. ఎవరైతే ఆశ ధనంగా పెట్టుకున్నాడో వాడికి మోహం కలుగుతుంది. మహాత్మాగాంధీగారు శరీరం విడిచిపెట్టినప్పుడు అతని మొత్తం ఆస్తులు అన్నీ కూడితే, ఇరవై రూపాయలే వచ్చింట! గాంధీగారికి త్యాగమే ధనం.

భగవాన్ శ్రీ రమణమహర్షి ఏమన్నారంటే, నువ్వు ఆత్మను స్మరించు, ఆత్మ కోసమే జీవించు, ఆత్మను ధ్యానం చెయ్యి, ఆత్మను విచారణ చెయ్యి, ఈ కోపం గొడవలు, కామం గొడవలు నీకు ఎందుకయ్యా, వాటంతట అవే రాలిపోతాయి అన్నారు.


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి** అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

SRI RAMANA KSHETRAM A/c. No. 6794857762
INDIAN BANK, VEDANGIPALEM BRANCH
IFSC Code : IDIB000V142, Contact No. 9866715896

# మనోమూలమే స్వరూపం

తాను అంటే బ్రహ్మము! వాస్తవంగా తాను ఎవరో తెలుసుకోవడంకన్నా ఉత్తమ మైన మహదాశయం మరొక్కటి లేదు. భగవాన్ శ్రీరమణులు, సద్గురు శ్రీనాన్నగారు వంటి మహాత్ములు ఇప్పుడే - ఇక్కడే - ఈ ఇహ జీవితంలోనే, ఈ వర్తమానంలోనే తాను ఎవరు అన్న సత్యాన్ని అనుభవైకవేద్యం చేసుకోవడం మీద గురిపెట్టారు. సాధారణంగా మనము మోక్షం అంటే భవిష్యత్తులోకి ఎదురుచూస్తాం! కాని మోక్షం ఇప్పుడే ఉంది, ఇక్కడే ఉంది, మన స్వరూపంగానే ఉంది. అహంకారం యొక్క పుట్టుక ఎక్కడ నుండి అని విచారణ చేయడం ద్వారా మన నుదుటివ్రాతను చెరిపేసుకోవడానికి ప్రయత్నించాలి. అట్లుకానిచో మన మానవజన్మ, మన చదువులు, మనము చేసే సాధనకు ప్రయోజనం ఏమున్నది? హృదయములో అనగా మనోమూలములో అంతరంగా, సూక్ష్మంగా ఉన్న సత్యాన్ని తానుగా గుర్తించాలి. అహంభావన ఎక్కడ నుండి పుట్టి, తిరిగి ఎక్కడ లయిస్తుందో, అదే మన స్వరూపం. భగవాన్ శ్రీరమణులు సిద్ధాంతము నుండి ఆచరణ వైపుకు మళ్లిస్తారు. ఆత్మ లేకుండా జీవుడు లేడు, జీవుడు వాస్తవముగా బ్రహ్మమే, ఆత్మే. నేను ఆత్మకాకుండా పోయిన క్షణం ఒక్కటైనా ఉంటే, తిరిగి దానిని పొందడం అనే ప్రశ్న ఉదయిస్తుంది. కానీ ఆత్మ లేకుండా వ్యక్తి ఉండే అవకాశమే లేదు; ఎట్లనగా సముద్రము తరంగము వలె కాబట్టి మనకు ఆలోచన కన్నా అవగాహన ముఖ్యము. మనస్సును బహిర్ముఖం కానీయకుండా వివేకము, విచక్షణ, అవగాహన శక్తిని పెంపొందించుకోవాలి. నేను ఎవరు అను విచారణ ద్వారా మనస్సును దాని మూలములోకి ఉపసంహరించి అక్కడ విలీనం చేయడమే అహంకార నివారణోపాయం. 'స్వస్వరూపానుభూతికి వైరాగ్యమే పెట్టుబడి' అంటారు సద్గురు శ్రీనాన్నగారు. వైరాగ్యము లేని సాధన వాసన లేని పుష్పము, ప్రాణము లేని శరీరము లాగున నిష్ప్రయోజనము. ప్రతి సాధకుడు అభ్యాస వైరాగ్యములను స్థిరపరచుకోవాలి. తాను ఎవరు అన్న సత్యాన్ని తెలుసుకోవడానికి విజ్ఞానంతో పనిలేదు; వివేకము, విచారణ చాలు. అహంకారాన్ని త్యాగం చేసి, దేహాత్మబుద్ధిని అతిక్రమించి, మోహాన్ని జయించి, స్వస్థితిలో నిలవాలి. స్వరూపజ్ఞానం కలిగితే, సృష్టిలో అణువణువు ప్రతీ అణువు పరమాత్మ స్వరూపంగా గోచరిస్తుంది. స్వరూపం సచ్చిదానందం అదే - పరమాత్మ!

- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064

# పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం అర్ధవరం గ్రామంలో వెలసిన దివ్యక్షేత్రాల సందర్శనం

**(గత సంచిక తరువాయి)**

రామశాస్త్రిగారు వేదం చెప్పే స్థలం నుంచి శివలింగాన్ని దర్శిస్తే అపూర్వమైన వెలుగుతో ప్రకాశించేది. ఆయన కూర్చున్న వ్యాసపీఠంలో సాధకులు కూర్చుని ధ్యానం చేస్తూ ఉంటే అంతులేని పరమశాంతి. అది కూడా నా అనుభవం. రామచంద్రమూర్తి అరణ్యవాసంలో ఒక చెట్టు క్రింద గొప్ప వెలుగు కనిపిస్తే ఏమిటి విశేషమని ప్రక్క నివాసిని అడిగితే ఇక్కడ ఒక మహాత్ముడు ఘోరమైన తపస్సు చేసారు. ఆయన సిద్ధపురుషుడు అన్నారు. అలాగే రామశాస్త్రిగారు కూడా. మరో విశేషం వారి సోదరులు నీలకంఠంగారు అవధాని కంచి పరమాచార్యులవారు, శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వాములను దర్శించి వారిపై ఆసువుగా అపూర్వంగా ఒక పద్యం వల్లిస్తే ఆయన చాలా సంతోషించి ఆశీర్వదించారు. వారి కుమారులే ఇప్పటి అర్చక స్వాములువారు. తండ్రి పూజా విధానాన్ని పుణికిపుచ్చుకొని శాస్త్రోక్తంగా పూజావిధానాన్ని నిర్వర్తించి గ్రామవాసులు, ఇతర గ్రామవాసులు ఇక్కడ అభిషేకాలు చేయించుకొని ఆనందిస్తూ వెళుతున్నారు. ఈ ఆలయాన్ని శ్రీ నాన్నగారు దర్శించారు.

మా గ్రామములోని బాలవెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని కూడా నూజివీడు జమీందార్లు నిర్మించినదే. మా తాతల ఉమ్మడి కుటుంబంలో వెయ్యి ఎకరాలు ఉండేది. ఒక తాతగారైన చినసోమరాజు తోబుట్టువైన బుచ్చెమ్మగారు తన 30 ఎకరాల పంటలో కొంత నందాదీపానికి, ఇతర ఖర్చులకు శివాలయానికి, వెంకటేశ్వరస్వామికి నూనె ఖర్చుల నిమిత్తంగా ఈనాటికీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆవిడ వితరణ అది. ఇక్కడ అర్చక స్వాములవారు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం వదులుకొని వెంకటేశ్వరస్వామి సేవలో తరించాలని నిర్ణయించుకొన్నారు. వారు స్మార్తులు అంటే శివకేశవులకు భేదం చూపరు. (గయలో కూడా అర్చకులు మేము స్మార్తులమని గర్వంగా చెప్పకుంటారు). శివాలయంలో కూడా శివునికి అభిషేకం చేస్తారు. పిల్లనిచ్చిన వారి మామగారు 20 మంది శిష్యులకు సామూహికంగా వేదం వల్లిస్తూ ఉంటే అంతమంది ఏకకంఠంతో పలుకుతూ ఉంటే ఎవరు అపస్వరంతో పలుకుతున్నారో తెలిసి అతన్ని మందలించేవారు. చరిత్రలో ఇది చాలా అరుదు. బాలవెంకటేశ్వరస్వామి సర్వాలంకరణ భూషితులు బంగారు పూతతో స్వామికి కిరీటం, రంగు రాళ్ళతో హారాలు, మణిమాణిక్యాలతో మెరిసిపోతుంటారు. నిజానికి అవి రంగు రాళ్ళు అయినా పచ్చల పతకాలు, నీలమణులుగానే భక్తులు చూచి మురిసిపోతుంటారు. స్వామికి బ్రహ్మోత్సవాలు 5 రోజులు 10 మంది ఘనాపాఠీ అర్చకులతో వేదఘోషలతో గ్రామవీధుల్లో ఊరేగించి చెరువులో భక్తులు చక్రస్నానం చేసి అన్న ప్రసాదాలు బ్రాహ్మణులతో చేయించి వితరణ చేస్తారు. వేంకటేశ్వరస్వామిని చూడటానికి రెండు కళ్ళు చాలవు. తిరుమలలో వేంకటేశ్వరస్వామిని ఇక్కడ నుండీ చూసినట్లే ఉంటుంది. కాకపోతే ఈ బాలవేంకటేశ్వరస్వామి ఎత్తు 3 అడుగులు మాత్రమే. ఈ బ్రహ్మోత్సవాలకు ఖర్చు సుమారు 6 లక్షలు అవుతుంది. దండు వెంకట రామరాజు నాయకత్వంలో భక్తుల సహకారంతో, ఒక్కొక్కరోజు ఒకరిద్దరు చొప్పన పీటలమీద కూర్చుని నిర్వహిస్తారు. బాణాసంచా, మంగళవాయిద్యాలతో, పుష్పయాగాలతో, కుంకుమ పూజలతో తిరుమలలో లేని అనేక వాహనాలతో స్వామివారిని పురవీధుల్లో ఊరేగిస్తారు. ఈ ఆలయాన్ని నాన్నగారు దర్శించారు.

**(వచ్చే సంచికలో మిగిలిన విశేషాలు తెలుపుతాను) - సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**